




మట్టిని ఫిల్టర్ చేసేందుకు ఉపయోగిస్తున్న ట్రాక్టర్ ఇంజన్లు

ఆకేరు కన్నీరు!

వర్ధన్నపేట రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఉమ్మడి జిల్లాకే కల్పతరువైన ఆకేరు వాగు అస్థిత్వానికి ప్రస్తుత పరిస్థితులు సవాల్‌గా మారాయి. పరివాహక ప్రదేశాల్లో అక్రమంగా మట్టిని, ఇసుకను తోడేస్తూ శివారు ప్రాంతాలు, గ్రామాల్లో ఉండే ప్రజలు, రైతులు దీనిని దినచర్యగా మార్చుకున్నారు. జీవనోపాధి కోసం కొన్ని కుటుంబాలు చేస్తుంటే.. వాటిని ఆసరాగా చేసుకున్న ఆసాములు రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు. ఇంతటి ప్రకృతి వైపరిత్యం జరుగుతున్నప్పటికీ వ్యవసాయ, రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్, విద్యుత్, పోలీసు అధికారులు నిమ్మకుండిపోవడం చర్చనీయాంశంగా మారింది. ధనార్జనే ధ్యేయంగా సాగుతున్న ఈ దందాకు కేరాఫ్ అడ్రస్‌గా వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట మండలం కావడం పట్ల పలు విమర్శలు వస్తున్నాయి.

ఆకేరు అస్థిత్వానికి సవాల్

వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి ప్రారంభమవుతున్న ఆకేరు వాగు నీరు సముద్రంలో కలుస్తోంది. జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల మీదుగా ఆకేరు వాగు పేరుతో పయణించి, ఖమ్మం జిల్లా నుంచి మున్నేరు వాగుగా మారి, గోదావరిలో కలిసి చివరికి సముద్రంలోకి వెళ్తోంది. ఇప్పటికే ప్లాస్టిక్, మురుగు నీరు, వ్యర్థాలతో నిండిన ఆకేరు వాగు, ఇప్పుడు వాగు శివారు ప్రాంతాల్లో అత్యంత లోతు తవ్వకాలు చేయడం ద్వారా భవిష్యత్తులో ప్రమాదంలో పడే అవకాశం ఉంది. వర్ధన్నపేట, కొత్తపెల్లి, ల్యాబర్తి గ్రామాల్లో దీనికి నిదర్శనం గానే స్తంభం లోతువరకు మట్టిని, ఇసుకను తోడి ఇష్టానుసారంగా భారీ గోతులు చేయడం కనిపిస్తోంది. దీంతో ఆకేరు వాగు పరివాహక ప్రాంతాలు ప్రమాద ఘంటికలను సూచికగా నిలుస్తోంది. తద్వారా వాగులోని ఇసుక, నీరు ఈ లోతట్టు ప్రాంతాలకు వెళ్లి ఎన్నో గ్రామాలకు ఇబ్బందులు కలిగించే అవకాశం లేకపోలేదు.

చట్టాల ఉల్లంఘన

2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో భూగర్భ జలాలను కాపాడుకోవడానికి అప్పటి ప్రభుత్వం నీరు, భూమి, వృక్షాల ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చింది. వాటి సంరక్షణకు ప్రత్యేక చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని తెలిపింది. దీనికోసం వాటర్ ల్యాండ్ ట్రీస్ ఆక్ట్(వాల్టా)గా రూపొందించి, బోరు బావులకు సంబంధించిన అనేక నిబంధనలను తయారు చేసింది. కనీసం ఎవరైనా రైతు బోరు వేసుకోవాలంటేనే భూమిని తవ్వేందుకు ముందుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని, సర్వే ఆధారంగా రెవెన్యూ, భూగర్భ జలవనరుల శాఖ అనుమతితో వేసుకోవాలని సూచించింది. కానీ, ఆ చట్టాన్ని ఉల్టాపల్టా చేసి ఇష్టారీతిన ఎకరాల కొద్ది భూమిని తవ్వేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు.

- వాగు పరివాహక మట్టిని తోడేస్తున్న అక్రమార్కులు
- పంటలు పండే భూములను ఛిద్రం చేస్తున్న వైనం
- ఈజీ మనీ కోసం చట్టాల ఉల్లంఘన
- 'వాల్టా' చట్టానికి యథేచ్ఛగా తూట్లు
- కళ్ల మూసుకున్న మైనింగ్, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్, అగ్రికల్చర్ శాఖలు
- భూసారం దెబ్బతిని, భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ల్యాబర్తిలో ప్రమాదపు అంచున ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

విద్యుత్ లైన్లకు ప్రమాదం

11కేవీ వైర్లు వెళ్లే విద్యుత్ స్తంభాల చుట్టూ మట్టిని తవ్వుతుండడం తో ప్రమాదపు అంచున నిలబ డి చూస్తున్నాయి. వర్ధన్నపేట మండల కేంద్రంతో పాటు కొత్తపెల్లి, ల్యాబర్తి గ్రామాల్లో దాదాపు 30కి పైగా స్తంభాలు కూలిపోయే స్థితిలో ఉన్నాయి. చివరకు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు సైతం గోతులు తీసుకుంటూ వస్తున్నారు. భారీ ఈదురుగాలులు, వరదలు వస్తే భారీ నష్టం జరిగే ప్రమాదం ఉంది. ఒక స్తంభం కూలితే మరిన్ని స్తంభాలు కూలిపోయి షార్ట్ సర్క్యూట్‌కు కారణమైతే పెద్ద ప్రమాదం వచ్చే అవకాశం ఉంది. గ్రామానికి సైతం ఈ ప్రమాదం తాకితే రూ.కోట్లలో నష్టం వాటిల్లి, మనుషుల ప్రాణాలకే ప్రమాదం ఉంటుందని స్థానికులు చెపుతున్నారు. ఈ పరిస్థితులపై విద్యుత్ అధికారులు దృష్టిసారించడం లేదు. స్తంభం కూలిపోయేలా గోతులు తీయడంతో పాటు, చుట్టూ ఐదు ఫీట్ల మేర ఎలాంటి పనులు చేయకూడదని అధికారులు చెపుతున్నారు. కానీ, మట్టిని తీసి స్తంభాలను యమపాశాలు మార్చిన వ్యక్తులపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

ప్రకృతి విధ్వంసానికి కారకులెవరు..?

ఇంతటి ప్రకృతి విధ్వంసానికి కారుకులెవరంటే అధికారుల పర్యవేక్షణ లోపం సైతం ఉందని పర్యావరణ వేత్తలు చెపుతున్నారు. మట్టి, ఇసుక పేరిట భూగర్భాన్ని చెరబడుతుంటే స్థానికంగా ఉండే అధికారులు, మండల, జిల్లాస్థాయి అధికారులు ఏం చేస్తున్నారో అంటూ నిలదీస్తున్నారు. ఆకేరు వాగు రేపటి భవిష్యత్తుపై ఇరిగేషన్ శాఖ, మట్టిని తీస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా మైనింగ్ శాఖ, వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తున్నా పట్టించుకోని రెవెన్యూ శాఖ, వ్యవసాయ పంట పొలాల భూసారం తగ్గిస్తుంటే చూస్తూ ఊరుకునే వ్యవసాయ శాఖ, రూ.కోట్లలో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిసినప్పటికీ నిమ్మకుండిపో తున్న విద్యుత్ శాఖ, ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తుంటే రోడ్లపై గస్తీకాయని పోలీస్‌శాఖలే ప్రకృతి విధ్వంసానికి పరోక్షంగా కారకులని ఆరోపిస్తున్నారు. అధికారుల్లో సమన్వయం లేకపోవడం, చూస్తూ మనకెందుకులే అనుకోవడంతోనే విధ్వంసం జరుగుతోందని ఆయా గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఏ శాఖ అధికారి, ఆ శాఖ పనిచేస్తే ఇలాంటి పరిస్థితులు ఉండవని వాపోతున్నారు.

ఒకరిపై ఒకరు దాటవేస్తూ..

ఆకేరు వాగు పరివాహక ప్రాంతంలో జరుగుతున్న ప్రకృతి దోపిడీపై అధికారులు మాట మారుస్తున్నారు. మా పరిధి కాదంటే మాది కాదంటూ దాటవేస్తున్నారు. మైనింగ్ అధికారులు స్పందిస్తూ అది వాల్టా చట్టం కింద వస్తుందని బదులిచ్చారు. రెవెన్యూ అధికారులు స్పందిస్తూ మట్టిని తీసే, తరలించే వాహనాలు ఉంటే వాటిపై మాత్రం చర్య తీసుకుంటామని, మట్టి గోతులకు మైనింగ్ శాఖ బాధ్యులని చెపుతోంది. ఇక విద్యుత్ శాఖ బదులిస్తూ దీనిపై చర్యలు తీసుకోవాలంటే ఉన్నతాధికారులకు నివేదించాలని చెపుతున్నారు. ఇసుక ట్రాక్టర్లను కట్టడి చేస్తున్నామని పోలీసులు, తమకు ఎలాంటి ఫిర్యాదులు రావడం లేదని వ్యవసాయ, ఇరిగేషన్ శాఖ అధికారులు చెప్పుకొచ్చారు.

జిల్లాను పంట ఉత్పత్తుల హబ్‌గా మార్చాలి

వరంగల్ కలెక్టర్ సత్య శారద

వర్ధన్నపేట రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పండ్ల ఉత్పత్తుల పంటలను ఎగుమతి చేయడంలో వరంగల్‌ను కేంద్ర బిందువుగా మార్చి ఉత్పత్తుల హబ్‌గా మార్చాలని జిల్లా కలెక్టర్ సత్యశారద కోరారు. శుక్రవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేటలో జిల్లా ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సహకారంతో మామిడిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు, నాణ్యత ప్రమాణాలు పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా రైతు ఉత్పత్తులైన మిర్చి, పత్తి, ఉద్యానవన పండ్ల పంటల్లోని మామిడి ఎగుమతులకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు ఉత్పత్తుల నాణ్యతలను పెంచి, లాభదాయకంగా ఉండేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఉద్యానవన అధికారులు, వ్యవసాయ అధికారులు పండ్ల వ్యాపారులకు, కొనుగోలుదారులకు సూచించాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సహకారంతో నాణ్యమైన మామిడిని ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. పండ్లు తీవ్రస్థాయిలో దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, చేయాల్సిన పనులను వివరించారు. పంట పూత దశలో, పంట కోత తర్వాత పండు ఈగలు, కీటకాల నష్ట నివారణ కోసం, వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల కోసమే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్‌హెల్త్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోతి, అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారి పెద్దస్వామి మాట్లాడుతూ.. పండ్ల పంటలను ఆశించి నష్టపరిచే కీటకాల నివారణ కోసం అతి తక్కువఖర్చుతో ఎరువుల తయారీ విధానం, రసాయన ఎరువుల వాడకం, పండ్ల చుట్టూ రక్షణ కవర్లను ఉపయోగించి పండ్ల పంటల దిగుబడిని, నాణ్యతను పెంచుకోవచ్చన్నారు. రైతులు ఒక సంఘంగా ఏర్పడి తమ నాణ్యమైన పంటలను ఎగుమతులు చేసుకోవచ్చన్నారు. అందుబాటులో గల వ్యాపారులు అమ్ముకుని క్వింటాకు రూ.20వేల అధిక ధరను పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా పండ్లు రవాణా సమయంలో వాహనాల్లో దెబ్బతింటున్నాయని రైతులు కోరడంతో కలెక్టర్ స్పందించారు. రవాణా సమయంలో దెబ్బతినకుండా ఉండడానికి, పండ్ల నాణ్యత కాపాడుకోవడానికి రక్షణ కవర్లను, బాక్సులను ప్రభుత్వ సహకారంతో అందచేసే విధంగా, ఉద్యానవన శాఖ అధికారులతో చర్చించి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ కార్యదర్శి నిర్మల, రైతులు పాల్గొన్నారు.

ఫిల్టర్‌బెడ్ మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయండి

- మేయర్ గుండు సుధారాణి
- ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్‌లో ఆకస్మిక తనిఖీలు



ఫిల్టర్‌బెడ్ అధికారులలతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ దేశాయిపేటలోని ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్‌లో నెలకొన్న మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. దేశాయిపేటలోని ఫిల్టర్‌బెడ్ శుక్రవారం మేయర్‌తో పాటు సంబంధిత అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. నీటిని ప్రజలకు అందించవలసిన నాణ్యతా ప్రమాణాలతో శుద్ధి చేసి సరఫరా చేయాలని ఆదేశించారు. ఫిల్టర్‌బెడ్‌లో చాలా మరమ్మతు సమస్యలు ఉన్నాయని, రూ.1కోటి నిధులతో మరమ్మతు పనులకు టెండర్ పిలవాలని అన్నారు. వేసవికాలం ప్రారంభం కాకముందే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మేయర్ అక్కడి నీటిని అధికారుల సమక్షంలో పరిశీలించారు. మేయర్ వెంట ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ శ్రీనివాస్, డీఈ రంగనాథ్‌లతో పాటు ఫిల్టర్‌బెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నర్సంపేటలో

'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

నర్సంపేట / నర్సంపేటటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా ప్రతీ సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంతూర్ ముత్యాలముగ్గులపోటీలను నిర్వహిస్తోంది. శనివారం వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ద్వారకపేటరోడ్‌లో సిద్ధార్థ ప్రైమ్ స్కూల్ (కాకతీయ గ్రాడ్యుయేట్స్ జూనియర్ కళాశాల) మైదానంలో ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్.. సంతూర్ ముత్యాలముగ్గుల పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో వరంగల్ జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మహిళలు పాల్గొననున్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.6వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4వేలు, తృతీయ బహుమతిగా రూ.3వేలు అందజేయనున్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతీ మహిళకు ప్రోత్సాహక బహుమతి ఉంటుంది.

నిబంధనలివీ..

మహిళలు మాత్రమే పాల్గొనాలి. ముగ్గు, రంగులు, పువ్వులు, తదితర సామగ్రి వారే తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. ఎన్ని చుక్కలు, ఎన్నివరుసలో చెప్పగలిగి ఉండాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు. విజేతల ఎంపికలో న్యాయనిర్ణేతలదే తుదినిర్ణయం. గొట్టాలు, బద్దలు, ఇతర పరికరాలు ఏమీ ఉపయోగించకుండా కేవలం చేతితోనే ముగ్గు వేయాల్సి ఉంటుంది. ఇక ముగ్గు అందంగా కనపడేందుకు సంప్రదాయరీతిలో గొబ్బెమ్మలు, బతుకమ్మలను అమర్చవచ్చు.





శిక్షణ కానిస్టేబుళ్ల నుంచి నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న తరుణ్ జోషి

పోలీస్ అంటే ఉద్యోగం కాదు.. కర్తవ్యం

- ప్రతీ సంఘటనను ఒక చాలెంజ్‌గా తీసుకోవాలి
- నిస్వార్థంగా ప్రజా సేవకు అంకితం కావాలి
- ప్రజల ప్రాణరక్షణే మన లక్ష్యం అవ్వాలి
- సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి
- ఏసీబీ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ తరుణ్ జోషి
- శిక్షణ పూర్తిచేసుకున్న 453 మంది కానిస్టేబుళ్లు
- అట్టహాసంగా దీక్షంత్ పాసింగ్ పరేడ్

7

కొత్త రుణాలు మంజూరు చేయండి

- రికవరీ లక్ష్యాలు వంద శాతం సాధించాలి
- డిపాజిట్లపై విస్తృత ప్రచారం జరపాలి
- రుణమాఫీ సమస్యలను పరిష్కరించాలి
- డీసీసీబీ పాలకవర్గ సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని

6





పీఎఫ్ కటాఫ్ తేదీ ఎత్తివేత ఎప్పుడు?

• నష్టపోతున్న బీడీ కార్మికులు • జీవన భృతి రాక ఇబ్బందులు • పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

హనుమకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో బీడీ కార్మికులు పీఎఫ్ కటాఫ్ తేదీ వల్ల జీవన భృతి (పింఛన్) పొందలేక పోతున్నారు. అనేక సంవత్సరాలుగా బీడీల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్న కార్మికులు జీవన చరమాంకంలో ఎలాంటి ఆర్థిక భరోసా లేక దుర్భర జీవితం గడుపుతున్నారు. చివరకు ఎలాంటి ఆసరా లేకుండానే కన్నుమూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అనుసరిస్తున్న వైఖరి వేలాది మంది బీడీ కార్మికుల పాలిట శాపంగా మారుతోంది. 2014 ఫిబ్రవరి 28 వరకు ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఖాతాలో నమోదు అయినవారికి మాత్రమే ప్రస్తుతం జీవన భృతి పింఛన్లు అందుతున్నాయి. కటాఫ్ తేదీ తర్వాత పీఎఫ్ కార్డు వచ్చినా ప్రభుత్వం పింఛన్‌కు పరిగణలోకి తీసుకోవడం లేదు.



ఎత్తివేతపై యూ టర్న్

2022 ఆగస్టులో పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేస్తున్నట్టు ప్రకటించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ తర్వాత యూటర్న్ తీసుకున్నది.. ఇక బీడీ పింఛన్లు పెంచేది లేదని చేతులెత్తేసింది. గత ప్రభుత్వం ఈ కటాఫ్ తేదీని ఎత్తివేస్తూ నిర్ణ యం తీసుకున్నది. పీఎఫ్ నెంబరు ఉంటే చాలు అందరికి జీవన భృతి లభిస్తుందని గొప్పగా చెప్పింది. ఈ మేరకు జీవో కూడా జారీ చేసింది. దీనితో బీడీ కార్మికులు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. 18-50 ఏళ్ల వయసువారు 1.5 లక్షల లోపు ఆదాయం కలిగి, ఆధార్, ఓటరు గుర్తింపుకార్డు, బ్యాంకు ఖాతా, రేషన్ కార్డు, ఈపీఎఫ్ అర్హత ధృవీకరణ పత్రం, ఆన్‌లైన్ స్టేట్‌మెంట్, పాస్‌పోర్టు సైజు ఫొటోతో ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో అందజేశారు. కానీ వారికి ఇప్పటి వరకు పింఛన్ మంజూరు కాలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 20వేల మంది వరకు దరఖాస్తులు దాఖలయ్యాయి. ఇవన్నీ ఇప్పుడు జిల్లాల వారీగా కలెక్టర్ల వద్ద ఉన్నాయి. వీటిపై సర్కార్ యూటర్న్ తీసుకోవడంతో కలెక్టర్లు కూడా ఏమీ చేయలేకపోయారు. దీంతో జీవన భృతి కోసం పెట్టుకున్న దరఖాస్తులకు మోక్షం లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఎత్తి వేయకపోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేలాది మంది బీడీ కార్మికులు జీవన భృతి ఆసరా పింఛన్‌కు అర్హులైనప్పటికీ పొందలేక పోతున్నారు.

ఉమ్మడి వరంగల్‌లో లక్ష మంది కార్మికులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్ష మందికిపైగా బీడీ కార్మికులు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలో ఉన్నారు. బీడీ పరిశ్రమ సంక్షోభంలో కూరుకు పోవడంతో పదేళ్ల కాలంలో చాలా బీడీ ఫ్యాక్టరీలు మూత పడ్డాయి. ఒకప్పుడు ఉమ్మడి జిల్లా లో 25కిపైగా బీడీ ఫ్యాక్టరీలు ఉండేవి.

కానీ ఇప్పుడు వాటి సంఖ్య పదికి తగ్గిపోయింది. బీడీ ఫ్యాక్టరీల యజమానులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న తమ బ్రాంచీల్లో కొన్నిటిని మూసివేయడంతో అనేక దశాబ్దాలుగా బీడీల తయారీపై ఆధారపడి జీవిస్తున్న బీడీ కార్మికుల సంఖ్య కూడా క్రమంగా తగ్గుతూ వస్తోంది.

గతంలో ఆందోళనలు

పీఎఫ్ కటాఫ్ తేదీ ఎత్తివేయాలని కోరుతూ పలు వామపక్ష కార్మిక సంఘాల నాయకత్వంలో గతంలో అనేక సార్లు బీడీ కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. పీఎఫ్ జీవన భృతి కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఇప్పటికీ సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు.

ఇప్పటికైనా పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేసి బీడీలు చుట్టేవారితో పాటుగా ఇతర కార్మికులకు పింఛన్ మంజూరీ చేయాలని, జీవన భృతి కింద నెలకు రూ 2016 అందజేయాలని, బీడీల తయారీకి తగినట్టు తునికాకును సరఫరా చేయాలని, బీడీల తయారీ కూలీ రేటు పెంచాలని, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇళ్ల నిర్మాణానికి రాయితీ ఇవ్వాలని, గతంలో మాదిరిగా ప్రభుత్వం సంక్షేమ నిధిని పునరుద్ధరించాలని, తమ పిల్లలకు ఉపకార వేతనాలు మంజూరు చేయాలని ఈఎస్ఐ కార్మిక ఆస్పత్రి ద్వారా వైద్య సేవలందించాలని బీడీ కార్మికులు కోరుతున్నారు.

అభిరుచి

50 ఏళ్లుగా నాణాలు, కరెన్సీ సేకరణ

ప్రత్యేకతను చాటుకుంటున్న సుధాకర్





స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఒకటా, రెండా.. వందలు రకాల నాణేలు, కరెన్సీ నోట్లు సేకరించారాయన. సుమారు 50ఏళ్లుగా తన అభిరుచిని కొనసాగిస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన యంజాల సుధాకర్. ఈ క్రమంలో రాజుల కాలంలో, స్వాతంత్ర్యం రాక ముందు, వచ్చిన తర్వాత వచ్చిన రకరకాల నాణేలు, నోట్లు ఆయన వద్ద ఉన్నాయి. ఎవరి దగ్గరైన ఏదైనా పాత నాణం, నోటు ఉందని తెలిస్తే వారి వద్దకు వెళ్లి మరీ దానిని సేకరించి భద్రపరుస్తున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని మండల ఆఫీసు క్రాస్ రోడ్డులో టెంట్ హౌస్ నిర్వహించే ఆయన వద్ద 1980 వరకు మనం విరివిగా వినియోగించిన పైస, 2 పైసలు, 3 పైసలు, 5 పైసలు, 10 పైసలు, 20 పైసలు, 25 పైసలు, 50 పైసలు, రూపాయి, రూ.5 నాణేలు, రూపాయి, రూ.2, రూ.5, రూ.10, రూ.20, రూ.50, రూ.100 నోట్లు ఉన్నాయి. వీటిలో శ్రీకృష్ణ దేవరాయలు, నిజాం నవాబుల కాలం నాటి నాణేలు కూడా కొన్ని ఉన్నాయి. అప్పుడప్పులు ఆయన వీటిని ప్రదర్శనకు పెట్టి మురిసి పోతుంటారు. దీపావళి పండుగ రోజు ధన లక్ష్మీ వ్రతాలు ఆచరించే వారెవరైనా పూజలుర చేసేందుకు అడిగితే కాదనకుండా ఇస్తుంటారు. పూజల అనంతరం మళ్లీ భద్రపరుస్తారు. 1980సమయంలో పాపడాలు అమ్మే వ్యక్తి వద్ద చిల్లర పైసలు ఎక్కువగా ఉండేవని, రకరకాల నాణేలను చూసి తనకు సేకరించాలనే ఆలోచన వచ్చిందని సుధాకర్ చెబుతున్నారు. ఆ రోజుల్లో ఎక్కువగా పోస్టల్ స్టాంపులు, సాలార్ జంగ్ మ్యూజియం చిత్రాలు, అగ్గి పెట్టె మూతలు, మార్బుల్ గోలీలు, పత్తాలు ఎక్కువగా సేకరించే వారని, అలా తాను కూడా ఒక హాబీగా ఎంచుకున్నానన్నారు. పాతతరం నాణేలు, కరెన్సీ నోట్లపై ముద్రించిన సంవత్సరంతోపాటు సంస్కృతీ, సంప్రదాయాలకు సంబంధించిన గుర్తులు ఉంటాయని, మన దేశ భాషలు, జాతీయ చిహ్నాలు, జాతీయ నాయకుల చిత్రాలు, ఆర్‌బీఐ గవర్నర్ పేరు, పంటలు, కళాకారులు, కవులు, నృత్య రీతులు, పాతకాలం నాటి రాజుల బొమ్మలు... ఇలా ఎన్నో అంశాలు తెలుస్తాయన్నారు. ప్రతీ నాణెం, కరెన్సీ నోటు అప్పటి పాలకులు, ప్రభుత్వ విధానాలను తెలియజేసేలా ఉంటాయన్నారు.









సుధాకర్ సేకరించిన నాణాలు, వివిధ దేశాల కరెన్సీ

అప్పులభారమున్నా హామీల అమలు

- 8 నుంచి అశ్వరావుపల్లి సాగునీటి విడుదల
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- లింగాలఘణపురం లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

లింగాలఘణపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆర్థిక పరిస్థితి పెనుభారంగా ఉన్నా, వెనకడుగు వేయకుండా ప్రభుత్వం హామీలు చేస్తోందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం లింగాలఘణపురం మండలకేంద్రంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం రూ. 7లక్షల కోట్ల అప్పుల భారంలో ఉందని, ప్రతీ నెలవడ్డీలతో పాటుగా అసలు డబ్బులను వాయిదాల రూపంలో చెల్లిస్తూనే మరో పక్క ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. సంక్రాంతి నుంచి రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందన్నారు. ప్రతీ ఎకరాకు రూ.7500 చొప్పున రైతుల ఖాతాల్లో డబ్బులను జమచేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా 25 లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్లు రుణాలను మాఫీ చేసిందన్నారు. ఈనెల 8 నుంచి అశ్వరావుపల్లి కుడికాలువ ద్వారా ప్రతీ ఎకరానికి గోదావరి జలాలను అందించేందుకు ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా 109 మంది లబ్ధిదారులకు రూ.1.09కోట్లు, 32 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 11 లక్షలు మొత్తంగా రూ.1.20కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, ఆర్డీవో గోపీరామ్, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్ కొల్లూరు నర్సింహులు, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, ఆర్‌ఐలుకిశోర్, భగత్ పాల్గొన్నారు.



లింగాలఘణపురంలో డ్రోన్ స్ప్రేయర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆధునిక సాగువిధానంతో లాభాలు

పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాని కనుగుణంగా ఆధునిక సాగువిధానం రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం లింగాలఘణపురం మండల కేంద్రంలో వనపర్తి గ్రామానికి చెందిన నేలతల్లి రైతు సహకార సంఘానికి నాబార్డు ఆర్థిక సహకారంతో మంజూరైన డ్రోన్ స్ప్రేయర్‌ను కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. డ్రోన్ లాంటి ఆధునిక పరికరాలతో రైతులు వ్యవసాయంలో ముందుకు కదిలితే శారీరక శ్రమతో పాటుగా అనవసరమైన ఖర్చులు తగ్గుతాయని ఎమ్మెల్యే అఅన్నారు. డ్రోన్‌కు రూ. 7.25 లక్షలు కానుండగా నాబార్డు రూ.6లక్షల ఆర్థికంగా రుణసాయాన్ని అందజేస్తుందని మిగతా 1.25 లక్షలు రైతులు తమ వాటాగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఏవో రామారావు నాయక్, ఆర్డీవో గోపీరాం, తహసిల్దార్ రవీందర్, ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ కొల్లూరు నర్సింహులు, పీఏసీఎస్ చైర్మన్లు బుషిగంపల ఉపేందర్, మల్ల శ్రీశైలం పాల్గొన్నారు.

చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్వేతకు అస్వస్థత

- ఆత్మహత్యాయత్నం చేశారంటూ మొదట్లో ప్రచారం
- ఫుడ్‌పాయిజన్ అయిందంటూ వీడియో ద్వారా వెల్లడించిన భర్త



నల్లనాగుల శ్వేత

బచ్చన్నపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సిద్ధిపేట జిల్లా చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని కట్కూరుకు చెందిన నల్లనాగుల శ్వేత వెంకటాచారి శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శ్వేత పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిందంటూ ఉదయం పెద్దఎత్తున ప్రచారం జరిగింది. దీంతో ఆమె భర్త వెంకటాచారి వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తన భార్య శ్వేతకుఫుడ్‌పాయిజన్ అయిందని, దాంతో తీవ్ర అస్వస్థతకు గురైనట్టు వివరించారు. తమపై దుష్ప్రచారాలు చేయటం తగదంటూ కోరారు. తమ కుటుంబంలో ఎలాంటి గొడవలు లేవని, రెండు రోజుల్లో డిశ్చార్జ్ అయి వస్తుందని తెలిపారు. ఈ ప్రచారం సిద్ధిపేట, జనగామ జిల్లాల్లో సంచలనం సృష్టించింది.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కృతమూర్తి శుక్రవారం కోరారు. 2025-26సంవత్సరానికి ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న వారు ఫిబ్రవరి 1 వరకు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 23న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

చైనా మాంజాలను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్

వరంగల్ క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నిషేధిత చైనా మాంజాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం కాజీపేట పీఎస్ పరిధిలో పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. పతంగులు ఎగురవేసేందుకు నిషేధిత మాంజాలను కాజీపేటలో పలుషాపుల్లో విక్రయిస్తున్నట్లుగా వచ్చిన పక్కా సమాచారం మేరకు ఐదుగురు వ్యక్తుల నుంచి రూ2,30,000 విలువ చేసే మాంజాలను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

ఆయిల్‌పాంతో లాభాలు

తెలంగాణ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

జనగామ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పాం సాగుతో రైతులకు మంచి లాభాలు వస్తాయని తెలంగాణ రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. జనగామ మండలం ఎల్లంల శివారులోని ఆయిల్‌పాం నర్సరీని శుక్రవారం పరిశీలించారు. ఆయిల్‌పాం మొక్కల ఉత్పత్తి, నిర్వ హణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ రాష్ట్రంలో రైతును రాజును చేయాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. పామాయిల్ ఉత్పత్తులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, రాష్ట్రంలోనే పండించడం ద్వారా ప్రభుత్వాలపై భారం తగ్గడంతో పాటు రైతులకు మంచి ఆదాయం వస్తుందన్నారు. ఆయిల్ పాం సాగుపై కొన్ని కంపెనీలు, కొన్ని సంఘాలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఆయిల్‌పాం గెలలను సేకరించేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం జనగామ జిల్లాలో 7 వేల ఎకరాల్లో పంటలు సాగవ్రుతున్నాయని, 30వేల ఎకరాలకు చేరగానే ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గు చూపేలా అధికారులు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.



జనగామ నర్సరీలో ఆయిల్‌పాం మొక్కలను పరిశీలిస్తున్న జంగా రాఘవరెడ్డి



సమావేశంలో డీసీసీ బ్యాంకు 2025- డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

కొత్త రుణాలు మంజూరు చేయండి

• డీసీసీబి పాలకవర్గ సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు •

హనుమకొండ సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ పొందిన రైతులకు వెంటనే కొత్తగా పంట రుణాలు అందచేయాలని డీసీసీ బ్యాంకు అధికారులను టెస్కాబ్ చైర్మన్ మార్నేనీ రవీందర్‌రావు ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంకు పాలకవర్గ సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన రవీందర్‌రావు అధికారులు, సభ్యులకు దిశా, నిర్దేశం చేశారు. ఇటీవలే మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో హైదరాబాద్‌లో జరిగిన సమీక్ష అంశాలను రవీందర్‌రావు సమావేశంలో ప్రస్తావించారు. డీసీసీ బ్యాంకు ఆర్థిక ప్రగతి, రుణాలు, రికవరీలు, పంట రుణాలు, రుణమాఫీ తదితర విషయాలపై మంత్రి స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు రవీందర్‌రావు పేర్కొన్నారు. ముఖ్యంగా కొత్త రుణాల మంజూరులో జాప్యం ఉండరాదని మంత్రి నిక్కచ్చిగా చెప్పినట్లు రవీందర్‌రావు వెల్లడించారు. అదే విధంగా రుణమాఫీ పొందిన రైతులకు కొత్త రుణాలు అందడంలో ఏమైనా సమస్యలు ఎదురైతే బ్యాంకు అధికారులు, సిబ్బంది వెను వెంటనే పరిష్కరించే బాధ్యతలు నిర్వహించాలన్నారు. బ్యాంకు ఆర్థిక ప్రగతి మరింత ఉన్నత స్థాయికి చేరేలా ప్రణాళికలు రూపొందించి కార్యాచరణలోకి తీసుకురావాలన్నారు. పలు విధాలుగా బ్యాంకు రుణాలు అందుబాటులో ఉన్నాయని, అయితే అవగాహన కొరవడడం వల్ల ప్రజలు రుణాలు పొందలేక పోతున్నారని పేర్కొన్నారు. ఉన్నత విద్య కోసం రుణాలు, బంగారం రుణాలు ఇలా కమర్షియల్ బ్యాంకుల కంటే విస్తృతంగా రుణాల కల్పన ఉన్న దశలో విస్తృత ప్రచారం జరపాలని అదేశించారు. అదే విధంగా డిపాజిట్లపై కూడా ఆకర్షణీయమైన వడ్డీని అందిస్తున్న క్రమంలో ప్రతీ అధికారి గ్రామ స్థాయిలోకి వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. రుణాల రకవరీ విషయంలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. వందకు వంద శాతం రికవరీ జరగాలని స్పష్టం చేశారు. రుణమాఫీలో ఏమైనా సాంకేతిక సమస్యల కారణంగా ఇంకా లబ్ధిపొందని వారు ఉంటే వెంటనే సమస్యను పరిష్కరించాలని టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు అధికారులను ఆదేశించారు.

సమావేశం అనంతరం డీసీసీ బ్యాంకు 2025-డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వరంగల్ డీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఉపేందర్‌రెడ్డి గ్రేటర్ హైదరాబాద్ గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన క్రమంలో ఆయనను రవీందర్‌రావు, పాలక వర్గ సభ్యులు, బ్యాంకు అధికారులు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సమావేశంలో సీఈవో వజీర్ సుల్తాన్, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్లు రమేశ్, రంజిత్, హరిప్రసాద్, రాజేశ్వర్‌రెడ్డి, మురళీధర్‌రావు, గోపాల్‌రావు, యాదగిరిరెడ్డి, నర్సింగరావు, శ్రీనివాసరెడ్డి, రవిరాజు, టెస్కాబ్ డీజీయం శ్రీనివాస్‌రావు, డీసీసీ బ్యాంకు డీజీఎం అశోక్, ఏజీఎం రాజు, మేనేజర్ నిహారిక తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2570	2345
పల్లికాయ (సూక)	7300	5600
పల్లికాయ (పచ్చిది)	4700	4500
కందులు	-	-
పెసళ్లు	7500	4000
పత్తి	7020	5800
పసుపు (కాడి)	11329	10235
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14000	9000
తేజ మిర్చి (కొత్తది)	15500	12000
తేజ ఏసీ	15400	14000
వండర్‌హాట్ ఏసీ	13500	13000
యూఎస్341ఏసీ	15000	11000
యూఎస్ 341 కొత్తది	15500	14500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

హ్యాట్సాఫ్ వాట్సాప్ యూత్

- గ్రామాల పేరుతో గ్రూపుగా ఏర్పడుతున్న యువత
- పేదలకు చేయూతనిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్న యువకులు

ఆదర్శం



తొర్రూరు మండలం వెంకటాపురంలో వెంకటాపురం సేవా ట్రస్టుద్వారా 50కేజీల బియ్యం అందస్తున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు (ఫైల్)

తొర్రూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సాంకేతికత ఏ మేరకు ప్రభావం చూపుతోందో అందరికీ తెలిసిందే. ముఖ్యంగా సోషల్ మీడియా అందరి జీవనంలో భాగమైపోయింది. ఇక వాట్సాప్ గ్రూపులకైతే కొదవేలేదు. అందరూ ఏదోఒక రకంగా వాట్సాప్ గ్రూప్‌లను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు యువత సమాజసేవే లక్ష్యంగా తమతమ గ్రామాల పేర్లతో గ్రూపులు తయారుచేసి.. నిరుపేదలకు, ఆర్థికంగా చితికిపోతున్న కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. అలా సహాయం పొందిన పలువురు 'హ్యాట్సాఫ్ వాట్సాప్ యూత్' అంటూ అభినందిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని 29 గ్రామాలు ఉండగా, ప్రతీ గ్రామంలో తమ ఊరి పేరుమీద వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి, ఆయా గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని, నిరాశ్రయులైన వృద్ధులను గుర్తించి.. వారి వివరాలను వాట్సాప్ గ్రూప్‌ల్లో షేర్ చేసి.. విద్యావంతులు, సేవాతత్పరులు, ఇతర ప్రాంతాల్లో ఉండే వారి తోచినంత సాయం చేస్తున్నారు.

- వెంకటాపురం గ్రామంలో 'మన ఊరు-మనమందరం' అనే వాట్సాప్ గ్రూప్ ద్వారా కొండ యాకన్న అనే గ్రామస్థుడు గ్రూపులోని సభ్యులను భాగస్వామ్యం చేస్తూ వెంకటాపురం సేవా ట్రస్టు పేరుతో వృద్ధులకు, నిరుపేదలకు, విద్యార్థులకు సాయం అందిస్తున్నారు. చనిపోయిన వారి కుటుంబాలకు అండగా నిలవడం, చలితో ఇబ్బందులు పడుతున్న వృద్ధులకు దుప్పట్లు, రగ్గులను అందజేస్తున్నారు. అలాగే తమతతమ ఇళ్లలో కనీసం శుభ, అశుభకార్యాలు చేసుకునే స్థితిలో లేని పేదలకు వంట సామగ్రిని అందిస్తున్నారు.
- వెలికట్టె గ్రామానికి చెందిన పోసాని సంతోష్, దీకొండ యాకన్న, రాము, అనిల్ అనే యువకులు వెల్లికట్టె గ్రామ సమాచారం, వెల్లికట్టె గ్రామ ప్రజలు అనే గ్రూపును క్రియేట్ చేసి.. అనారోగ్యంతో ఉన్న పేదలు, తమ వారి అంత్యక్రియలు కూడా చేయలేని స్థితిలో ఉన్న వారికి మరణించిన పేదల కుటుంబాలకు సాయం అందించడంతో పాటు.. ఏదైనా సమస్యతో మృతి చెందిన వారి కుటుంబాల్లో ఉన్న చిన్నారుల పేరిట తమకు తోచిన కొంత మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేస్తున్నారు.
- కంఠాయపాలెం గ్రామానికి చెందిన ఎర్రం రాజు, కమ్మగాని శ్యామ్ అనే ఇద్దరు 'మా గ్రామం కంఠాయపాలెం, మా ఊరు కంఠాయపాలెం' అనే వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేశారు. తద్వారా గ్రామంలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నా, ఆర్థికంగా చితికిపోతున్న వారికి ఆయా గ్రూపుల్లో ఉన్న సభ్యుల సహకారంతో సహాయం చేస్తుంటారు. ఇలా ఎన్నో గ్రామాల్లో అనేక మంది యువకులు వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా సమాజసేవలో పాలుపంచుకుంటున్నారు. సాంకేతికతను వినియోగించుకుంటూ అభాగ్యులకు అండగా ఉంటున్నారు.



వెల్లికట్టెలో కొమ్ము సతీష్ భార్యకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన పత్రాన్ని అందజేస్తున్న వాట్సాప్ గ్రూప్ సభ్యులు (ఫైల్)



ఐనవోలు మల్లికార్జున స్వామి దేవస్థానం

ఐనవోలు జాతరపై సమీక్ష సమావేశమేదీ?

- పట్టుమని పదిరోజులే సమయం
- నిర్లక్ష్యం వీడకపోతే భక్తులకు తిప్పలు తప్పనట్టే!

ఐనవోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే రెండో పెద్ద జాతరగా గుర్తింపు పొందిన ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలకు పట్టుమని పదిరోజుల సమయమే ఉంది. నెల రోజుల ముందే ఏర్పాటు చేయాల్సిన సమీక్ష సమావేశం.. నేటికీ నిర్వహించకపోవడంపై భక్తులకు అసౌకర్యాలు కలిగే అవకాశం ఉంది. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జాతర సమయం సమీపిస్తున్నా.. నేటికీ సమీక్ష సమావేశం ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. నెల ముందే జాతర సమీక్ష సమావేశం నిర్వహించి 15 శాఖల జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేస్తేగానీ జాతర వరకు 80 శాతం పనులు పూర్తవుతాయి. కలెక్టర్ ఆధ్వర్యంలో 15 శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే భక్తులకు సౌకర్యాలు లభిస్తాయి. లేదంటే ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. పారిశుధ్య సిబ్బంది నియమించి వ్యర్థాలను తొలగించడం, తాగునీరు, రహదారుల మరమ్మతులు, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ చెక్ పోస్టుల ఏర్పాటు, పార్కింగ్‌లకు స్థలాల కేటాయింపు, వైద్య సేవలు, ఆర్టీసీ బస్సుల రవాణా సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం, భక్తుల స్నానాలకు నల్లాల ఏర్పాటు, మహిళలు దుస్తులు మార్చుకోడానికి (డ్రెస్సింగ్ రూమ్) తడుకలతో ఏర్పాటు, భక్తుల వసతి, పోలీస్‌బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి కమాండ్ కంట్రోల్ సిస్టం ద్వారా జాతరను పర్యవేక్షిస్తారు. గత జాతరలో జరిగిన లోపాలను గుర్తించి మళ్లీ పునరావృతం కాకుండా సౌకర్యాలను మెరుగుపర్చాల్సిన అవసరం ఉంది.

ట్రస్టు బోర్డు నియామకం ఎప్పుడు?

ఐనవోలు దేవస్థానం ట్రస్టుబోర్డు నియామకం ఊసేలేకుండా పోయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ట్రస్టుబోర్డులో ధర్మకర్తలు, చైర్మన్ పదవుల కోసం ఆ పార్టీ నాయకులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. గత జాతర సమయంలో వారం రోజుల కోసం చైర్మన్ లేకుండా ధర్మకర్తల కమిటీని నియమించి చేతులు దులుపుకున్నారు. వచ్చే జాతర వరకు ట్రస్టుబోర్డును నియమింపచేస్తామని పార్టీ శ్రేణులకు హామీ ఇచ్చారు. కానీ మళ్లీ జాతర రానేవచ్చింది. ఇప్పటి వరకు ట్రస్టు బోర్డు నియామకమే జరుగలేదని ఆశావహులు మదనపడుతున్నారు. ఈ సారి పునరుద్ధరణ కమిటీతోనే సరిపెట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తాం

- అద్దంకి నాగేశ్వర్‌రావు, ఈఓ

జాతర సమీక్ష సమావేశం తేదీని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఖరారు చేస్తానని చెప్పారు. ఎండోమెంట్ శాఖ నుంచి జాతర టెండర్లు పూర్తిచేసుకున్నాం. చలువ పందిర్లు, క్యూలైన్ల నిర్మాణ పనులు, విద్యుత్తు లైట్ల ఏర్పాట్లు చేపట్టాం. పార్కింగ్ స్థలాల చదును, చెక్‌పోస్టుల ఏర్పాట్లలో పోలీస్‌శాఖ నిమగ్నమైంది.

12 నుంచి మల్లికార్జునుడి మహాజాతర

- సంక్రాంతి నుంచి ఉగాది వరకు ఉత్సవాలు
- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు

ఆధ్యాత్మికం



ఐనవోలు మల్లికార్జునస్వామి

ఐనవోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు సమీపించాయి. లక్షలాది మంది భక్తులు భక్తి భావంతో ముద్దుగా పిలుచుకునే మల్లన్న జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. జనవరి మకర సంక్రమణంతో ప్రారంభమయ్యే జాతర ఉత్సవాలు ఉగాది వరకు కొనసాగుతాయి. స్వామి వారికి ధృష్టికుంభం డిసెంబరు 16 సోమవారం (ధను సంక్రమణ) నిర్వహించారు. ఈ నెల 12న ఆదివారం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ధ్వజరోహణం, నూతన వస్త్రాలంకరణం చేయనున్నారు. 13న సోమవారం భోగి పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వచ్చి దర్శించుకుంటారు. 14న మంగళవారం మకర సంక్రాంతిని పురస్కరించుకుని రాత్రి దేవుడి రథం(బండ్లు) ఆలయం చుట్టూ తిరుగుతాయి. ఆయా జిల్లాల నుంచి వచ్చే భక్తుల తోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన భక్తులు తరలి వస్తారు. 15న బుధవారం కనుమ స్వామి వారి దర్శనం. 16న గురువారం మహాసంప్రోక్షణ క్రతువు సమారాధన పూజ కార్యక్రమాలు జరుగుతాయి. ఫిబ్రవరి 3 సోమవారం వసంత పంచమి శ్రీభ్రమరాంభిక అమ్మవారి దశమ వార్షికోత్సవం, 12న బుధవారం రేణుకాదేవి(ఎల్లమ్మదేవత) పండగ నిర్వహిస్తారు.

శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవములు

శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు పాంచాహ్నిక దీక్షతో త్రికుండాత్మకంగా భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవములు శైవాగమోక్తంగా వైభవంగా నిర్వహించనున్నారు. 24న సోమవారంసూర్యచంద్ర ప్రభవాహనసేవలు, 25న మంగళవారం అశ్వవాహనసేవ, శేషవాహనసేవ, 26న బుధవారం మహాశివరాత్రి శివకల్యాణం, పెద్దపట్నం, సింహవాహనసేవ, రాత్రి 7 గంటలకు శ్రీ భ్రమరాంబమల్లికార్జునస్వామి వారి కల్యాణం అనంతరం నంది వాహనసేవ నిర్వహి స్తారు. 27న గురువారం రావణ వాహనసేవ, రథోత్సవం, పురవీధి సేవ, 28న శుక్రవారం పర్వతవాహనసేవ నిర్వహిస్తారు. వసంతోత్సవము, పండితసన్మానాలు జరుగును. మార్చి 23 న ఆదివారం పెద్దపట్నం కల్యాణం, 30న ఆదివారం మంగళవారం ఉగాది పండుగ పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు.

వారంతపు జాతర జరుగుతుందిలా..

జనవరి 19 నుంచి మార్చి 30 వరకు వారంతపు జాతరలు ప్రతీ ఆది, బుధ వారల్లో నిర్వహిస్తారు. ఈ యేడు మొత్తం 11 ఆదివారాలు, 10 బుధవారాల్లో వారాంతపు జాతర జరుగనుంది. జాతర వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వచ్చి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకుంటారుని ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ తెలిపారు.

వలస జీవులు..



వరి నాట్లు వేస్తున్న పురుషులు, మహిళలు

కోల్‌కతా టు కాటారం!

- ఉపాధి కోసం వస్తున్న కూలీలు
- ఉదయం నుంచే పొలం పనుల్లోకి..

కాటారం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం వందలాది మైళ్ల కుటుంబాలతో సహా తరలివచ్చారు. ఉన్న ఊరు వదిలి.. వందలాది మంది పశ్చిమబెంగాల్ రాష్ట్ర కూలీలు భూపాలపల్లి జిల్లా కాటారానికి వచ్చారు. కోల్‌కతాకు 16కిలోమీటర్ల దూరంలో ఉన్న పలు గ్రామాలకు చెందిన వారు రైళ్లలో సుమారు 1200 కిలోమీటర్లు ప్రయాణించి.. కాటారం చేరుకున్నారు. వారంతా కొందరు స్థానికుల సాయంతో వరినాటు పనులకు వెళుతున్నారు. 20 నుంచి 22మందితో బృందాలుగా ఏర్పడి వరినాట్లు వేస్తున్నారు. మహిళలు నాట్లు వేస్తుండగా.. పురుషులు నారు మోయడం, మడుల్లో పంచడం, ఇతరత్రా పనులు చేస్తున్నారు. అయితే వీరి రాకతో రైతులకు కొంత ఊరట లభించినట్లయ్యింది. స్థానికంగా గ్రామాల్లో ఉండే కూలీలు ఉదయం 9-10గంటల మధ్య నాట్లు వేయడానికి ఇళ్ల నుంచి బయలుదేరుతుంటారు. కానీ పశ్చిమబెంగాల్ కూలీలు మాత్రం ఉదయం 7గంటలకే పొలాలకు చేరుకుంటున్నారు. తాము పనికి వచ్చిన చోటనే కలిసికట్టుగా వంట చేసుకుంటూ భోజనం చేయడం లాంటివి చేస్తున్నారు. ఇక కూలీల బృందాలకు పనులు చూపిస్తున్న మధ్యవర్తులు వంటసామగ్రి, నిత్యవసరాలు అందిస్తున్నారు. వారే రైతులనుంచి ఎకరానికి ఇంత వసూలు చేస్తూ నెలవారీగా కూలీలకు డబ ఉబ్బులు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో కొంత కమీషన్ తీసుకుంటున్నారు. ఏదేమైనా ఇతర ప్రాంతాల కూలీల రాకతో స్థానికంగా కూలీల కొరత, ఇతర ఇబ్బందుల నుంచి రైతులు కొంత ఉపశమనం పొందుతున్నారు.



ఉదయాన్నే వంటలతో సహా పొలం వద్ద కూలీలు

చైనా వైరస్‌పై సర్వత్రా చర్చ

అప్రమత్తత అవసరమంటున్న వైద్యులు, అధికారులు

వరంగల్ మెడికల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చైనాలో హెచ్ఎంపీవీ అనే కొత్త వైరస్ విస్తరిస్తోందన్న వార్తలు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. కొవిడ్ తరహాలోనే ఈ వైరస్ లక్షణాలు కూడా ఉంటాయన్న సమాచారంతో అందరూ నాలుగేళ్ల క్రితం నాటి కొవిడ్ అత్యవసర పరిస్థితులను గుర్తుచేసుకుంటున్నారు. కొవిడ్ తరహాలోనే కొత్తవైరస్ కూడా చైనా నుంచే విజృంభిస్తోందని తెలియడంతో ఆందోళన చెందుతున్నారు. అయితే దీనిపై స్పందించిన ఇండియన్ హెల్త్ ఏజెన్సీ ప్రజలకు పలు సూచనలు చేసింది. ప్రస్తుతం మన దేశంలో ఈ కొత్తవైరస్ జాడ లేదని, అయినప్పటికీ కొవిడ్ నాటి పరిస్థితుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొంది. దీనిపై హనుమకొండ డీఎంహెచ్‌వో అప్పయ్యతో పాటు పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముందుజాగ్రత్తగా మాస్కులు ధరించాలని, సమూహాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొవిడ్ సమయంలో తీసుకున్న జాగ్రత్తలనే పాటిస్తే వైరస్ బారి నుంచి తప్పించుకోచ్చని చెబుతున్నారు.

పోలీస్ అంటే ఉద్యోగం కాదు కర్తవ్యం

- ఏసీబీ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ తరుణ్ జోషి
- శిక్షణ పూర్తిచేసుకున్న 453 మంది కానిస్టేబుళ్లు
- అట్టహాసంగా దీక్షంత్ పాసింగ్ పరేడ్



పరేడ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్స్, గౌరవవందనం స్వీకరిస్తున్న తరుణ్‌జోషి



మాట్లాడుతున్న ఏసీబీ డైరెక్టర్ డా, తరుణ్ జోషి (ఐపీఎస్)

మామునూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అంటే కేవలం ఉద్యోగం కాదని.. అది ఒక కర్తవ్యం అని, ప్రతీ సంఘటనను పోలీసులు ఒక చాలెంజ్‌గా తీసుకోవాలని తెలంగాణ ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి సూచించారు. శుక్రవారం మామునూరు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన దీక్షంత్ పాసింగ్ ఔట్ పరేడ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న పోలీసులకు, ఉన్నతాధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 9 నెలల కఠోర శిక్షణలో కానిస్టేబుళ్ల నేర్చుకున్న కొన్ని ప్రధాన అంశాలను ప్రదర్శించారు. బైక్ స్టంట్స్, ఆత్మరక్షణ ఫైట్స్, కత్తిసాము, కర్రసాము చేసి అధికారులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా తరుణ్ జోషి మాట్లాడుతూ.. సమస్యల తో పోలీసులను ఆశ్రయించే వారికి న్యాయం చేయాలని సూచించారు. ఇటీవల సమాజంలో సైబర్ నేరాలు, హింస, ఆర్థిక నేరాలు బాగా పెరిగాయని అన్నారు. అన్ని సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని పనిచేయాలని సూచించారు. ట్రైనింగ్‌లో ఉన్న ఫిట్‌నెస్‌ను ఎప్పటికీ కాపాడుకోవాలన్నారు. ట్రైనింగ్‌తో పాటు పరేడ్‌లో ప్రతిభ కనబరిచిన వారికి ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులను అందించి అభినందించారు. అనంతరం 453 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు ఈ పరేడ్‌తో వీడ్కోలు పలికారు. వారిని కలుసుకునేందుకు ఉమ్మడి పది జిల్లాల నుంచి తల్లిదండ్రులు, బంధుమిత్రులు తరలివచ్చారు. పరేడ్‌లో వారి విన్యాసాలు చూస్తూ ఆనందంలో మునిగిపోయారు. ఆత్మీయ అలింగనం చేసుకొని తన్మయత్వం చెందారు.



పాసింగ్ పరేడ్‌లో జాతీయజెండాతో ప్రదర్శన



పాసింగ్ పరేడ్‌కు హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బంది, శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు

ఒక్కొక్కరిని ఒక్కో ఆయుధంలా తయారు చేశాం..

- రామ్‌ప్రకాశ్, కమాండెంట్



ప్రతీ ఒక్కరిని ఒక వెపన్ (ఆయుధం)లా తయారు చేశాం. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే మానసిక ధైర్యాన్ని అందించాం. శారీరక దృఢత్వం కోసం పరేడ్ డ్రిల్ నిర్వహించాం. మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు యోగా, మెడిటేషన్ వంటివి నేర్పించాం. శిక్షణలో ఎక్కువ మంది పేద, మధ్య తరగతి వారే ఉన్నందున పేదలకు సత్వర న్యాయం అందిస్తారని ఆశిస్తున్నాం.

మా అన్నయ్య కల నెరవేర్చా..

- ఎల్ నాగేందర్, టీజీఎస్పీ కానిస్టేబుల్ సంగారెడ్డి



మా అన్నయ్య చిన్నప్పటి నుంచి పోలీస్ అవ్వాలని చాలా ప్రత్నించారు. కాని ఫిజికల్ టెస్టులలో ఫెయిలై ఉద్యోగం సాధించలేకపోయాడు. కాని, పోలీస్ ఉద్యోగంపై మక్కువతో నాకు అనేక సూచనలు చేసి పోలీస్ ఉద్యోగం సాధించేలా సహాయపడ్డాడు. భవిష్యత్తులో మరిన్ని ప్రమోషన్‌లు తెచ్చుకుని మంచి స్థాయికి చేరుకుంటా. సమాజానికి సేవ చేస్తా.

నాన్న స్ఫూర్తితో ..

- ఎ.విజయ్ టీజీఎస్పీ కానిస్టేబుల్ సిద్దిపేట్



నాకు చిన్నప్పటి నుంచి పోలీస్ వృత్తి అంటే చాలా ఇష్టం. మానాన్న కూడా పోలీస్ ఆఫీసర్ అవ్వాలని చాలా సార్లు ప్రయత్నించారు. కానీ ఉపాధ్యాయ వృత్తిలోనే ఉండి పోయారు. అందువల్ల నన్ను ప్రోత్సహించారు. పోలీస్ ఉద్యోగం సాధించి సమాజానికి సేవ చేయాలని చేప్పేవారు. ఆ ప్రోత్సాహంతోనే నేను ఈ రోజు మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాను. చాలా ఆనందంగా ఉంది.

అన్యాయాన్ని అరికట్టడమే లక్ష్యం

- నగేష్ యాదవ్, టీజీఎస్పీ కానిస్టేబుల్ సంగారెడ్డి



మాది వ్యవసాయ కుటుంబం. గొర్రెల కాపరిగా పనిచేస్తూ రెండోసారి ప్రయత్నించి ఉద్యోగం సంపాదించాను. ఆర్థికంగా చిన్నప్పటి నుంచి అనేక కష్టాలు పడ్డాను. నా కష్టాలే గురువులా నన్ను ముందుకు నడిపించాయి. పేదవారికి న్యాయం చేస్తూ డ్రగ్స్, హత్యాచారాలను అరికట్టేందుకు కృషి చేస్తా. భవిష్యత్తులో ఇన్‌స్పెక్టర్ అవ్వాలన్నది నా కల.

సమాజ సేవే లక్ష్యం..

- పాండు, టీజీఎస్పీ కానిస్టేబుల్ సంగారెడ్డి



సమాజంలో జరిగే అఘాయిత్యాలు, అత్యాచారాలను టీవీలలో చూస్తూ విసిగిపోయా. వాటిని అరికట్టాలంటే పోలీసు ఉద్యోగమే కరెక్టని యూనిఫాం మీద మక్కువతో ఈ ఉద్యోగం సాధించాను. అల్లరిమూకల ఆగడాలను అరికట్టడంతో పాటు వీలైనంతవరకు సంఘసేవ చేస్తా.

ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో పూలే జయంతి

మట్టెవాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మట్టెవాడలోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో శుక్రవారం సావిత్రిబాయి పఫ్తలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ దండాపంతుల రాంమూర్తి శర్మ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే సంఘ సంస్కర్త, దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు అని కొనియాడారు. అనంతరం మహిళా ఉపాధ్యాయురాలిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షురాలు గంగు రాధారాణి, హబీబ్ జిలాని, ప్రసాద్, సంధ్య, సంధ్యారాణి, మౌనిక, ఆరిఫా, జబీస్, సౌజన్య, జ్యోతి, ధృవతార, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు


కలెక్టరేట్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ సత్యశారద



అంధుల పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న బహుజన సంక్షేమ సంఘం నాయకులు


రంగశాయిపేట ఆర్టీఏ జంక్షన్‌లో సావిత్రిబాయి పూలేకు నివాళులు అర్పిస్తున్న ఉద్యమకారులు



రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే

- జయంతి సభలో కొనియాడిన కలెక్టర్ సత్యశారద
- జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 3: (ఆంధ్రజ్యోతి): దేశంలోని మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని కలెక్టర్ సత్యశారద కొనియాడారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యారంగానికి సావిత్రిబాయి చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, బీసీ, ఎస్సీ, మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు పుష్పలత, భాగ్యలక్ష్మీ, రమేశ్, సౌజన్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● వరంగల్ టౌన్: వరంగల్ ఆటోనగర్‌లోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాలలో బీసీ బహుజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కటకం విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర సలహాదారుడు ఆకారపు మోహన్ హాజరై పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆమంచ సంజయ్‌కుమార్, పిట్టల కృష్ణంరాజు, తుల గణేష్ పాల్గొన్నారు.

● శంభునిపేట : రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పూలే జయంతి నిర్వహించారు. మహిళా అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో అసమానతలతో పాటు లింగ భేదాన్ని నివారించటానికి నాడు ప్రజలను చైతన్యం చేసిన సంఘ సంస్కర్త సావిత్రిబాయిపూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. పూలే చిత్ర పటానికి నివాళులు అర్పించి మహిళా అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.సంపత్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఖిలావరంగల్ మండలం తిమ్మాపూర్‌లో ఏకశిలా యూత్ సలహాదారుడు మేకల సూరయ్య ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. హెచ్‌ఎంలు చంద్రం, కుమారస్వామి, ఇల్లందుల రవి, కె శ్రీదేవి, స్వరూప, ఆకుల రాజేష్, విద్యార్థులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

● ఆర్టీఏ జంక్షన్‌లో టీఆర్‌ఎస్ నాయకులు, ఉద్యమకారుల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు బి జయశంకర్, ఎర్ర విజయ్‌కుమార్, యాడాల జగపతి, వంగపూరి సదానందం, బోళ్ల రాజు, జోరిక సదానందం, కలకోట్ల క్రాంతి, గొల్లపల్లి వీరస్వామి, గంపల గోవర్ధన్, తేలు రాకేష్, కర్ణాటక బిక్షపతి, అంబాల ఉదయ్, ఎమ్డీ గౌస్, ఉసిల్ల కిరణ్, విశ్వతేజ పాల్గొన్నారు.

● కరీమాబాద్: నగరంలోని అండర్ రైల్వేగేటు ప్రాంతంలోని 32,33,39,40వ డివిజన్లలో శుక్రవారం సావిత్రిబాయి పూలే 194వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం, ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యంనగర్‌లో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు అప్పాజీ వాణి, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల, ఐద్వా సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి పాల్గొన్నారు.

● ఉర్సులోని శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మరుపల్ల రవి, ప్రధానోపాధ్యాయుడు చిట్యాల సోమశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. లక్ష్మీనగర్‌లో నిర్వహించిన సావిత్రి బాయి పూలే జయంతి వేడుకల్లో పిట్ట రాజేంద్రప్రసాద్, అశోక్, చక్రవర్తి పాల్గొన్నారు.

● గిర్మాజీపేట: వరంగల్ యాకుత్‌పురాలోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాల, కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శుక్రవారం సావిత్రి బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్ తదితరులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళల విద్య కోసం ఆమె చేసిన కృషిని కొనియాడారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ జి.రాంమోహన్, వైస్ ప్రిన్సిపాల్ బి.మధు, కాంగ్రెస్ నాయకులు కమల్, రామకృష్ణ, శారధ, నయీం, లావణ్య, జహీరా, ఫర్హానా, అమర్, యాకుబ్, దౌడు నాగరాజు, రవి, శ్యామల పాల్గొన్నారు.

● కృష్ణకాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శరధృతి, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారులు పి.వనమాల, ప్రవళిక, అధ్యాపకులు కరుణశ్రీ, కవిత, హేమలత, కల్పన, మంజుల, విజయలక్ష్మి, మనోహరి, ఇష్రత్, స్వప్న, హరికృష్ణ, శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: అన్నారు. మధ్యకోటలోని ఆరెళ్ళి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారయణ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కాసుల శైలేంద్రకుమార్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు శోభారాణి, కాసుల శైలేంద్రకుమార్‌లు సౌభాగ్య, లక్ష్మి, రాణి, రజిత, శుక్లాంభర, ఎం. సురేందర్‌రెడ్డి, జి.రాములు, రాజు, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

● శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓర్సు రాజు మాట్లాడుతూ.. బాలికలకోసం పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యను అందించిన వనిత సావిత్రీబాయి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎల్. శరత్, మహ్మద్ అక్బర్‌పాషా, నామోజు వెంకటాద్రి, వనం సౌందర్య, సుంకరి భవానీ, పద్మ తదితర నాయకులు పాల్గొన్నారు.

● ఖిలావరంగల్‌లో ఐద్వా ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల, జిల్లా, నగర నాయకులు అప్పాజీ వాణి, దివ్య, సమీనా, టి. భవానీ, ఎమ్డీ జుబేదా, సరిత, బేగం, జి ప్రభాకర్, ఎమ్డీ ఆలీమ్, సాంబయ్య, సాజియా, కృష్ణ పాల్గొన్నారు.


అండర్‌రైల్వే గేట్ ప్రాంతంలో వేడుకలను నిర్వహిస్తున్న ఐద్వా సభ్యులు


యాకుత్‌పురాలోని గిరిజన గురుకులంలో మహిళా ఉపాధ్యాయులను సత్కరించిన కాంగ్రెస్ నాయకులు


మధ్యకోటలో ఆరెళ్ళి బుచ్చయ్య ప్రభుత్వ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



ఖిలావరంగల్‌లో నివాళి అర్పించిన ఐద్వా జిల్లా నాయకులు

పీటీసీలో న్యూఇయర్ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న ఎస్పీ పూజ

మామునూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో శుక్రవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పీటీసీ ప్రిన్సిపాల్ ఎస్పీ పూజ కేక్ కట్ చేసి అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రమేష్, వెంకటేశ్వర్‌రావు, రవీందర్, పాండునాయక్, భిక్షపతి, ఆర్.ఐ లు చంద్రశేఖర్, మహేష్, నవీన్, కాశీరాం, డబ్ల్యూఆర్ఎస్ఐలు సి.సి రామాంజనేయరెడ్డి, సుమన్, పీఆర్‌వో రామాచారి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరించిన కలెక్టర్లు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 3: (ఆంధ్రజ్యోతి): టీఎన్‌జీవోస్ వరంగల్ జిల్లా శాఖ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ సత్యశారద శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులందరూ బాధ్యతగా పనిచేసి జిల్లాను ప్రగతిపథంలో నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ నాయకులు గజ్జల రామ్‌కిషన్, గాజె వేణుగోపాల్, పి.సదానందం, హేమనాయక్, దుర్గారావు, ఇంద్రసేనారెడ్డి, రాజు, రమాదేవి, రాజేష్, మధుచంద్ర, శ్రీనివాస్, సాంబయ్య, జ్యోతి, రజనీకాంత్, రజిత, సునీత నాయక్, రామకృష్ణ, మేఘన, కవిత తదితరులు పాల్గొన్నారు.

● కాశిబుగ్గ: తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎం.విద్యాలత, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోడం రవిప్రకాష్, ప్రధాన కార్యదర్శి చాట్ల రవికుమార్, ఉపాధ్యక్షులు సునీల్, జాయింట్ సెక్రటరీలు పల్లవి, రమేష్, కోశాధికారి ఖాజా ఇక్బాల్, కరుణకుమారి, వేణుగోపాల్, ప్రవీణ్, జయరాం, శ్రీనివాసరావు, అబ్దుల్ రఫీక్, భాగ్యమ్మ, డీఆర్‌డీఏ ఏవో శ్రీనివాస్ రెడ్డి, సూపరిండెంట్ శ్రీనివాసస్వామి, ఇందిర పాల్గొన్నారు.

మూడో రోజుకు హమాలీల సమ్మె



సమ్మె శిబిరం వద్ద మాట్లాడుతున్న దామెర కృష్ణ

వరంగల్ వ్యవసాయం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కూలి రేట్లు పెంచాలని కోరుతూ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో హమాలి కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరింది. దీక్షా శిబిరాన్ని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి దామెర కృష్ణ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్ సప్లయీస్ అధికారులు కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేవనబోయిన రాంబాబు, గంధ్రకోట చంద్రమౌళి, కుక్కల రాజు, బండి లింగమూర్తి, నల్ల బక్కయ్య, గుండపు కుమార్, అంబరబోయిన కుమార్, అనిల్, పోషాలు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక భవన్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి

- తెలంగాణ ప్రజాఫ్రంట్ డిమాండ్


నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాఫ్రంట్ నేతలు

కాశిబుగ్గ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అజంజాహి కార్మిక భవన్ స్థలం రిజిస్ట్రేషన్‌ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోకన్వీనర్ రమాదేవి, జిల్లా అధ్యక్షుడు జనగాం కుమారస్వామి డిమాండ్ చేశారు. కార్మిక భవన్ స్థలం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ చేసిన వారు, చేయించుకున్న వారు ఇద్దరిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మిల్లు మూతపడినప్పటి నుంచి కార్మికుల ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేయగా 134 మందికి 200చదరపు గజాల చొప్పున కేటాయించారని గుర్తుచేశారు. మిగతా 318 మంది కార్మికులకు స్థలం కేటాయించాలని ఉద్యమిస్తున్నామని, ఈ క్రమంలో సుప్రీంకోర్టు తీర్పును వెల్లడించిందని అన్నారు. కోర్టు తీర్పును మాజీ ఎమ్మెల్యే పక్కదారి పట్టించి మిల్లు స్థలంలో కాకుండా మడిపెల్లిలో గ్రామంలో స్థలాలు వస్తాయని కార్మికులను మభ్యపెట్టారని విమర్శించారు. కార్మిక భవన్ వేదికగా ఎన్నో ఉద్యమాల్లో పాల్గొని రాజకీయాలు చేసి నాయకులుగా ఎదిగిన కడియం శ్రీహరి, బండా ప్రకాష్, గుండు సుధారాణి, పురుషోత్తం వంటి వారు ఇప్పుడు ఎక్కడ పోయారని విమర్శించారు. కార్మిక భవన్ నిర్మించేంత వరకు, కార్మికులకు ఇళ్ల స్థలాలు మిల్లు స్థలంలోనే ఇప్పించేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రమేష్, ఆరెల్లి బిక్షపతి, వీరస్వామి, ప్రవీణ్, క్రాంతి, సందీప్, సాంబయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

కార్పొరేషన్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

అజంజాహి కార్మిక భవన్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన గ్రేటర్ వరంగల్ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని చెరువుల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కార్మిక భవన్ స్థలం కబ్జాకు సహకరించిన, దొంగ పత్రాలు సృష్టించిన, ఇంటి నెంబరు మార్పించిన, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అనుమతి ఇచ్చిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యకు శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ కబ్జాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారిందరిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వడుప్సా, ట్రస్మా నాయకులు


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వడుప్సా, ట్రస్మా కార్యవర్గం

కరీమాబాద్, జనవరి3 (ఆంధ్రజ్యోతి): వడుప్సా, ట్రస్మా వరంగల్ జిల్లా కమిటీ కార్యవర్గం శుక్రవారం వరంగల్ కలెక్టర్ సత్యశారదను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వారిలో వడుప్సా, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు అంకటి వీరస్వామి, గౌరవ అధ్యక్షుడు ఆడెపు శ్యాం, జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లా రవి, కోశాధికారి ఠాగూర్ జ్ఞానేశ్వర్ సింగ్, జిల్లా సలహాదారులు కోడెం శ్రీధర్, ఖిలా వరంగల్ మండల జోన్ అధ్యక్షుడు కూచన క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శి దాసి సతీష్ మూర్తి, కోశాధికారి కూరపాటి మోహన్, సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద ఆస్పత్రిలో మందుల కొరత తీర్చండి: సీనియర్ సిటిజన్ల వినతి

వరంగల్ కలెక్టరేట్: అనంతలక్ష్మి ఆయుర్వేదిక్ ప్రభుత్వ ఆస్పత్రిలో సరిపడా మందులు లేవని, వెంటనే తెప్పించేలా చర్యలు తీసుకోవాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలెక్టర్ సత్యశారదకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 పడకల ఆస్పత్రిలో నెల రోజులు నుంచి మందులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు తేరాల యుగంధర్, మార్క రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

బీటీరోడ్డు పనులు ప్రారంభం


కొనసాగుతున్న బీటీ రోడ్డు పనులు

ఖిలావరంగల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు తూర్పుకోటకు తారు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. 37వ డివిజన్ వాకింగ్ గ్రౌండ్‌నుంచి తూర్పుకోట వరకు రూ.2.50లక్షలతో చేపట్టిన పనులను కార్పొరేటర్ వెల్పు గొండ సువర్ణ-సురేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ మంజూరు చేసిన నిధులతో ఇప్పటికే రోడ్డు వెడల్పు, డ్రైయినేజీ, వర్షంనీటి పైప్‌లైన్ల ఏర్పాటు పనులు చేపట్టామని, అందులో భాగంగానే తూర్పుకోట తారురోడ్డు పనులను ప్రారంభించామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోయిని దూడయ్య, వీరన్న, సంగరబోయిన చందర్, అల్లం కేశవరాజు, బొలుగొడ్డు శ్రీనివాస్, నిరబోయిన గిరి,బంగారి శ్రీనివాస్, రాజమ ల్లు, ప్రతాప్, కర్ణాకర్, మేకల కృష్ణ, బొలేషా, అర్షం రాంబాబు, కిరణ్, సూపర్‌వైజర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణ రక్షణ

శంభునిపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు వచ్చినప్పునప్పుడు సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలను కాపాడవచ్చని డాక్టర్ ఆకారపు రాజగోపాల్ అన్నారు. శుక్రవారం ఆయన రంగశాయిపేట ప్రభుత్వ బాలికల పాఠశాలలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గుండెపోటుపై అవగాహన లేక అనేక మంది ప్రాణాలను కోల్పోతున్నారని, కార్డియో పల్మనరీ రిసెసిటేషన్ (సీపీఆర్) చేసి వారి ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. దాన్ని ఏవిధంగా చేయాలో సుమారు 500 మంది విద్యారులకు ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు శేర్ల అనిల్ కుమార్, సీహెచ్ సత్యనారాయణ, ఎమ్డీ యాకూబ్ పాషా, హరికిషన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజగోపాల్

సీసీఐ సీఎండీకి సన్మానం


లలిత్‌కుమార్ గుప్తాను సన్మానిస్తున్న కాటన్ అసోసియేషన్ సభ్యులు

వరంగల్ వ్యవసాయం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండి) లలిత్ కుమార్ గుప్తాను శుక్రవారం కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ అధ్యక్ష,కార్యదర్శులతో సత్కరించారు. సీసీఐ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు శుక్రవారం వరంగల్‌కు వచ్చిన ఆయనను భద్రకాళి దేవాలయానికి తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యాటక, వ్యవసాయ రంగాల గురించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో సీసీఐ జనరల్ మేనేజర్ పి.అమర్నాథ్‌రెడ్డి, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటి అర్జున్ దవే, కాటన్ అసోసియేషన్ ప్రతినిధులు చింతపల్లి వీరారావు, దుగ్యాల గోపాలరావు, నాగమల్ల ఓంకారేశ్వర్, పింగిలి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కరీమాబాద్, జనవరి3 (ఆంధ్రజ్యోతి): భర్తను కోల్పోయి ముగ్గురు పల్లలతో ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న ఓ వితంతు మహిళకు సనాతన హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరుకులను అందజేశారు. ఉప్పల్ గ్రామానికి చెందిన పోలు స్వప్న అనే వివాహిత భర్తను కోల్పోయి ఆర్థిక సమస్యలతో తన ముగ్గురుపిల్లలను పోషించేందుకు ఇబ్బందిపడుతుండగా సమితి సభ్యులు ఆమెకు రెండు నెలలకు సరిపడా సరుకులను అందజేశారు. కార్యక్రమంలో సనాతన సేవా సమితి వ్యవస్థాపకుడు తాళ్లపెల్లి నగేష్, అధ్యక్షుడు మిట్టపెల్లి వేణు, సభ్యులు గణేష్, వేణు, హరి, తిలక్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ అధ్యక్షుడికి సన్మానం


శెంకేసి రాజేష్, కరుణశ్రీ దంపతులను సత్కరిస్తున్న ఆర్‌వైఎఫ్ సభ్యులు

శంభునిపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రంగశాయిపేటకు చెందిన శెంకేసి రాజేష్ ఇటీవల టీఎన్జీవోస్ వరంగల్ సిటీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయన భార్య శెంకేసి కరుణశ్రీ కేఎల్ యూనివర్సిటీ నుంచి ఆంగ్లంలో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం రంగశాయిపేటలో వారికి అభినందన సభ ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది, సామాజికవేత్త శేర్ల అనిల్ కుమార్, ఆర్‌వైఎఫ్ బాధ్యులు కొట్టె వినయ్ కుమర్, ఆవునూరి కుమారస్వామి, రావుల సురేష్, మహేష్, రాగి శ్రీకాంత్, బిట్టు ఎలుగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పరపతి సంఘం కార్యవర్గం ఎన్నిక


వెంకటేశ్వర్లు (అధ్యక్షుడు)

వరంగల్ టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కొత్తవాడలోని పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ భవన్‌లో శుక్రవారం పద్మజ్యోతి పరస్పర సహకార పరపతి సంఘం నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిప్ప వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా వలుస వెంకటస్వామి, ఉపాధ్యక్షులుగా అడిగొప్పుల సంపత్, దాసరి భాస్కర్, సహాయ కార్యదర్శిగా ఆడెపు రవి, కోశాధికారిగా పోరండ్ల సాంబయ్య, సహాయ కోశాధికారిగా కూచన లక్ష్మీనారాయణ, డైరెక్టర్లుగా పోరండ్ల సతీష్, కూచన రాములు, ముంద్రాతి వెంకటేశ్వర్లు, తాటిపాముల స్రవంతి, గజ్జెల కావ్య ఎన్నికయ్యారు.

నేడు బీజేపీ మండలాధ్యక్షుల ఎన్నిక

మిల్స్‌కాలనీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ మండలాధ్యక్షులను శనివారం ఎన్నుకుంటామని ఆ పార్టీ జోనల్ అబ్జర్వర్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి బంగారు శ్రుతి తెలిపారు. శుక్రవారం ధర్మారంలోని పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. సంస్థాగత ఎన్నికలకు ముందే పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. మండల అధ్యక్షుల ఎన్నిక ప్రక్రియపై ఆమె దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి వేముల నరేందర్, జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, శ్రీధర్, వన్నాల శ్రీరాములు, ప్రధానకార్యదర్శి బాకం హరిశంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కోర్‌కమిటీ సభ్యులు తిరుపతిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రఘునారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ★★
ANDHRAJYOTHY
గ్రేటర్ వరంగల్
5
శనివారం 4 జనవరి 2025



మట్టిని ఫిల్టర్ చేసేందుకు ఉపయోగిస్తున్న ట్రాక్టర్ ఇంజన్లు

ఆకేరు కన్నీరు!

వర్ధన్నపేట రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఉమ్మడి జిల్లాకే కల్పతరువైన ఆకేరు వాగు అస్థిత్వానికి ప్రస్తుత పరిస్థితులు సవాల్‌గా మారాయి. పరివాహక ప్రదేశాల్లో అక్రమంగా మట్టిని, ఇసుకను తోడేస్తూ శివారు ప్రాంతాలు, గ్రామాల్లో ఉండే ప్రజలు, రైతులు దీనిని దినచర్యగా మార్చుకున్నారు. జీవనోపాధి కోసం కొన్ని కుటుంబాలు చేస్తుంటే.. వాటిని ఆసరాగా చేసుకున్న ఆసాములు రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు. ఇంతటి ప్రకృతి వైపరిత్యం జరుగుతున్నప్పటికీ వ్యవసాయ, రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్, విద్యుత్, పోలీసు అధికారులు నిమ్మకుండిపోవడం చర్చనీయాంశంగా మారింది. ధనార్జనే ధ్యేయంగా సాగుతున్న ఈ దందాకు కేరాఫ్ అడ్రస్‌గా వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట మండలం కావడం పట్ల పలు విమర్శలు వస్తున్నాయి.

ఆకేరు అస్థిత్వానికి సవాల్

వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి ప్రారంభమవుతున్న ఆకేరు వాగు నీరు సముద్రంలో కలుస్తోంది. జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల మీదుగా ఆకేరు వాగు పేరుతో పయణించి, ఖమ్మం జిల్లా నుంచి మున్నేరు వాగుగా మారి, గోదావరిలో కలిసి చివరికి సముద్రంలోకి వెళ్తోంది. ఇప్పటికే ప్లాస్టిక్, మురు నీరు, వ్యర్థాలతో నిండిన ఆకేరు వాగు, ఇప్పుడు వాగు శివారు ప్రాంతాల్లో అత్యంత లోతు తవ్వకాలు చేయడం ద్వారా భవిష్యత్తులో ప్రమాదంలో పడే అవకాశం ఉంది. వర్ధన్నపేట, కొత్తపెల్లి, ల్యాబర్తి గ్రామాల్లో దీనికి నిదర్శనం గానే స్తంభం లోతువరకు మట్టిని, ఇసుకను తోడి ఇష్టానుసారంగా భారీ గోతులు చేయడం కనిపిస్తోంది. దీంతో ఆకేరు వాగు పరివాహక ప్రాంతాలు ప్రమాద ఘంటికలను సూచికగా నిలుస్తోంది. తద్వారా వాగులోని ఇసుక, నీరు ఈ లోతట్టు ప్రాంతాలకు వెళ్లి ఎన్నో గ్రామాలకు ఇబ్బందులు కలిగించే అవకాశం లేకపోలేదు.

చట్టాల ఉల్లంఘన

2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో భూగర్భ జలాలను కాపాడుకోవడానికి అప్పటి ప్రభుత్వం నీరు, భూమి, వృక్షాల ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చింది. వాటి సంరక్షణకు ప్రత్యేక చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని తెలిపింది. దీనికోసం వాటర్ ల్యాండ్ ట్రీస్ ఆక్ట్(వాల్టా)గా రూపొందించి, బోరు బావులకు సంబంధించిన అనేక నిబంధనలను తయారు చేసింది. కనీసం ఎవరైనా రైతు బోరు వేసుకోవాలంటేనే భూమిని తవ్వేందుకు ముందుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని, సర్వే ఆధారంగా రెవెన్యూ, భూగర్భ జలవనరుల శాఖ అనుమతితో వేసుకోవాలని సూచించింది. కానీ, ఆ చట్టాన్ని ఉల్టాపల్టా చేసి ఇష్టారీతిన ఎకరాల కొద్ది భూమిని తవ్వేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు.

- వాగు పరివాహక మట్టిని తోడేస్తున్న అక్రమార్కులు
- పంటలు పండే భూములను ఛిద్రం చేస్తున్న వైనం
- ఈజీ మనీ కోసం చట్టాల ఉల్లంఘన
- 'వాల్టా' చట్టానికి యథేచ్ఛగా తూట్లు
- కళ్ల మూసుకున్న మైనింగ్, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్, అగ్రికల్చర్ శాఖలు
- భూసారం దెబ్బతిని, భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ల్యాబర్తిలో ప్రమాదపు అంచున ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

విద్యుత్ లైన్లకు ప్రమాదం

11కేవీ వైర్లు వెళ్లే విద్యుత్ స్తంభాల చుట్టూ మట్టిని తవ్వుతుండడం తో ప్రమాదపు అంచున నిలబ డి చూస్తున్నాయి. వర్ధన్నపేట మండల కేంద్రంతో పాటు కొత్తపెల్లి, ల్యాబర్తి గ్రామాల్లో దాదాపు 30కి పైగా స్తంభాలు కూలిపోయే స్థితిలో ఉన్నాయి. చివరకు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు సైతం గోతులు తీసుకుంటూ వస్తున్నారు. భారీ ఈదురుగాలులు, వరదలు వస్తే భారీ నష్టం జరిగే ప్రమాదం ఉంది. ఒక స్తంభం కూలితే మరిన్ని స్తంభాలు కూలిపోయి షార్ట్ సర్క్యూట్‌కు కారణమైతే పెద్ద ప్రమాదం వచ్చే అవకాశం ఉంది. గ్రామానికి సైతం ఈ ప్రమాదం తాకితే రూ.కోట్లలో నష్టం వాటిల్లి, మనుషుల ప్రాణాలకే ప్రమాదం ఉంటుందని స్థానికులు చెపుతున్నారు. ఈ పరిస్థితులపై విద్యుత్ అధికారులు దృష్టిసారించడం లేదు. స్తంభం కూలిపోయేలా గోతులు తీయడంతో పాటు, చుట్టూ ఐదు ఫీట్ల మేర ఎలాంటి పనులు చేయకూడదని అధికారులు చెపుతున్నారు. కానీ, మట్టిని తీసి స్తంభాలను యమపాశాలు మార్చిన వ్యక్తులపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

ప్రకృతి విధ్వంసానికి కారకులెవరు..?

ఇంతటి ప్రకృతి విధ్వంసానికి కారుకులెవరంటే అధికారుల పర్యవేక్షణ లోపం సైతం ఉందని పర్యావరణ వేత్తలు చెపుతున్నారు. మట్టి, ఇసుక పేరిట భూగర్భాన్ని చెరబడుతుంటే స్థానికంగా ఉండే అధికారులు, మండల, జిల్లాస్థాయి అధికారులు ఏం చేస్తున్నారో అంటూ నిలదీస్తున్నారు. ఆకేరు వాగు రేపటి భవిష్యత్తుపై ఇరిగేషన్ శాఖ, మట్టిని తీస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా మైనింగ్ శాఖ, వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తున్నా పట్టించుకోని రెవెన్యూ శాఖ, వ్యవసాయ పంట పొలాల భూసారం తగ్గిస్తుంటే చూస్తూ ఊరుకునే వ్యవసాయ శాఖ, రూ.కోట్లలో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిసినప్పటికీ నిమ్మకుండిపో తున్న విద్యుత్ శాఖ, ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తుంటే రోడ్లపై గస్తీకాయని పోలీస్‌శాఖలే ప్రకృతి విధ్వంసానికి పరోక్షంగా కారకులని ఆరోపిస్తున్నారు. అధికారుల్లో సమన్వయం లేకపోవడం, చూస్తూ మనకెందుకులే అనుకోవడంతోనే విధ్వంసం జరుగుతోందని ఆయా గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఏ శాఖ అధికారి, ఆ శాఖ పనిచేస్తే ఇలాంటి పరిస్థితులు ఉండవని వాపోతున్నారు.

ఒకరిపై ఒకరు దాటవేస్తూ..

ఆకేరు వాగు పరివాహక ప్రాంతంలో జరుగుతున్న ప్రకృతి దోపిడీపై అధికారులు మాట మారుస్తున్నారు. మా పరిధి కాదంటే మాది కాదంటూ దాటవేస్తున్నారు. మైనింగ్ అధికారులు స్పందిస్తూ అది వాల్టా చట్టం కింద వస్తుందని బదులిచ్చారు. రెవెన్యూ అధికారులు స్పందిస్తూ మట్టిని తీసే, తరలించే వాహనాలు ఉంటే వాటిపై మాత్రం చర్య తీసుకుంటామని, మట్టి గోతులకు మైనింగ్ శాఖ బాధ్యులని చెపుతోంది. ఇక విద్యుత్ శాఖ బదులిస్తూ దీనిపై చర్యలు తీసుకోవాలంటే ఉన్నతాధికారులకు నివేదించాలని చెపుతున్నారు. ఇసుక ట్రాక్టర్లను కట్టడి చేస్తున్నామని పోలీసులు, తమకు ఎలాంటి ఫిర్యాదులు రావడం లేదని వ్యవసాయ, ఇరిగేషన్ శాఖ అధికారులు చెప్పుకొచ్చారు.

జిల్లాను పంట ఉత్పత్తుల హబ్‌గా మార్చాలి

వరంగల్ కలెక్టర్ సత్య శారద

వర్ధన్నపేట రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పండ్ల ఉత్పత్తుల పంటలను ఎగుమతి చేయడంలో వరంగల్‌ను కేంద్ర బిందువుగా మార్చి ఉత్పత్తుల హబ్‌గా మార్చాలని జిల్లా కలెక్టర్ సత్యశారద కోరారు. శుక్రవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేటలో జిల్లా ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సహకారంతో మామడిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు, నాణ్యత ప్రమాణాలు పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా రైతు ఉత్పత్తులైన మిర్చి, పత్తి, ఉద్యానవన పండ్ల పంటల్లోని మామిడి ఎగుమతులకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు ఉత్పత్తుల నాణ్యతలను పెంచి, లాభదాయకంగా ఉండేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఉద్యానవన అధికారులు, వ్యవసాయ అధికారులు పండ్ల వ్యాపారులకు, కొనుగోలుదారులకు సూచించాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సహకారంతో నాణ్యమైన మామిడిని ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. పండ్లు తీవ్రస్థాయిలో దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, చేయాల్సిన పనులను వివరించారు. పంట పూత దశలో, పంట కోత తర్వాత పండు ఈగలు, కీటకాల నష్ట నివారణ కోసం, వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల కోసమే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్‌హెల్త్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోతి, అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారి పెద్దస్వామి మాట్లాడుతూ.. పండ్ల పంటలను ఆశించి నష్టపరిచే కీటకాల నివారణ కోసం అతి తక్కువఖర్చుతో ఎరువుల తయారీ విధానం, రసాయన ఎరువుల వాడకం, పండ్ల చుట్టూ రక్షణ కవర్లను ఉపయోగించి పండ్ల పంటల దిగుబడిని, నాణ్యతను పెంచుకోవచ్చన్నారు. రైతులు ఒక సంఘంగా ఏర్పడి తమ నాణ్యమైన పంటలను ఎగుమతులు చేసుకోవచ్చన్నారు. అందుబాటులో గల వ్యాపారులు అమ్ముకుని క్వింటాకు రూ.20వేల అధిక ధరను పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా పండ్లు రవాణా సమయంలో వాహనాల్లో దెబ్బతింటున్నాయని రైతులు కోరడంతో కలెక్టర్ స్పందించారు. రవాణా సమయంలో దెబ్బతినకుండా ఉండడానికి, పండ్ల నాణ్యత కాపాడుకోవడానికి రక్షణ కవర్లను, బాక్సులను ప్రభుత్వ సహకారంతో అందచేసే విధంగా, ఉద్యానవన శాఖ అధికారులతో చర్చించి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ కార్యదర్శి నిర్మల, రైతులు పాల్గొన్నారు.

ఫిల్టర్‌బెడ్ మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయండి

- మేయర్ గుండు సుధారాణి
- ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్‌లో అకస్మిక తనిఖీలు



ఫిల్టర్‌బెడ్ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ దేశాయిపేటలోని ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్‌లో నెలకొన్న మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. దేశాయిపేటలోని ఫిల్టర్‌బెడ్ శుక్రవారం మేయర్‌తో పాటు సంబంధిత అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. నీటిని ప్రజలకు అందించవలసిన నాణ్యతా ప్రమాణాలతో శుద్ధి చేసి సరఫరా చేయాలని ఆదేశించారు. ఫిల్టర్‌బెడ్‌లో చాలా మరమ్మతు సమస్యలు ఉన్నాయని, రూ.1కోటి నిధులతో మరమ్మతు పనులకు టెండర్ పిలవాలని అన్నారు. వేసవికాలం ప్రారంభం కాకముందే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మేయర్ అక్కడి నీటిని అధికారుల సమక్షంలో పరిశీలించారు. మేయర్ వెంట ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ శ్రీనివాస్, డీఈ రంగనాథ్‌లతో పాటు ఫిల్టర్‌బెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నర్సంపేటలో
'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

నర్సంపేట / నర్సంపేటటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా ప్రతీ సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంతూర్ ముత్యాలముగ్గులపోటీలను నిర్వహిస్తోంది. శనివారం వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ద్వారకపేటరోడ్‌లో సిద్ధార్థ ప్రైమ్ స్కూల్ (కాకతీయ గ్రాడ్యుయేట్స్ జూనియర్ కళాశాల) మైదానంలో ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్.. సంతూర్ ముత్యాలముగ్గుల పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో వరంగల్ జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మహిళలు పాల్గొననున్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.6వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4వేలు, తృతీయ బహుమతిగా రూ.3వేలు అందజేయనున్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతీ మహిళకు ప్రోత్సాహక బహుమతి ఉంటుంది.

నిబంధనలివీ..

మహిళలు మాత్రమే పాల్గొనాలి. ముగ్గు, రంగులు, పువ్వులు, తదితర సామగ్రి వారే తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. ఎన్ని చుక్కలు, ఎన్నివరుసలో చెప్పగలిగి ఉండాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు. విజేతల ఎంపికలో న్యాయనిర్ణేతలదే తుదినిర్ణయం. గొట్టాలు, బద్దలు, ఇతర పరికరాలు ఏమీ ఉపయోగించకుండా కేవలం చేతితోనే ముగ్గు వేయాల్సి ఉంటుంది. ఇక ముగ్గు అందంగా కనపడేందుకు సంప్రదాయరీతిలో గొబ్బెమ్మలు, బతుకమ్మలను అమర్చవచ్చు.





శిక్షణ కానిస్టేబుళ్ల నుంచి నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న తరుణ్ జోషి

పోలీస్ అంటే ఉద్యోగం కాదు.. కర్తవ్యం

- ప్రతీ సంఘటనను ఒక చాలెంజ్‌గా తీసుకోవాలి
- నిస్వార్థంగా ప్రజా సేవకు అంకితం కావాలి
- ప్రజల ప్రాణరక్షణే మన లక్ష్యం అవ్వాలి
- సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి
- ఏసీబీ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ తరుణ్ జోషి
- శిక్షణ పూర్తిచేసుకున్న 453 మంది కానిస్టేబుళ్లు
- అట్టహాసంగా దీక్షంత్ పాసింగ్ పరేడ్

7

కొత్త రుణాలు మంజూరు చేయండి

- రికవరీ లక్ష్యాలు వంద శాతం సాధించాలి
- డిపాజిట్లపై విస్తృత ప్రచారం జరపాలి
- రుణమాఫీ సమస్యలను పరిష్కరించాలి
- డీసీసీబీ పాలకవర్గ సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని

6

రాజ్యాధికారం ఎవరి సొంతం కాదు

సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణలో పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాధికారం ఎవరి సొంతం కాదని, ఎవరికీ శాశ్వతం కాదని ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, బీఆర్ఎస్ నేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని మైలారం గ్రామంలో ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో రాజ్యాధికారాన్ని దక్కించుకున్న తొలి కల్లు గీత కార్మికుడు సర్వాయి పాపన్నే అన్నారు. బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించినట్టు గుర్తు చేశారు. సాధారణ కులంలో జన్మించినప్పటికీ ఆనాటి సామాజిక వ్యవస్థల్లో ఆధిపత్య కులాల అధికారాన్ని, బానిసత్వాన్ని ధిక్కరించి దళిత బహుజనులను రాజ్యాధికారం వైపు నడిపిన తొలి బహుజన రాజని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రంగు కుమార్, పూస మధు, తాళ్లపెల్లి సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, ఎలమంచలి శ్రీనివాస్‌రెడ్డి, లేతాకుల రంగారెడ్డి, కోలా సంపత్, బైరు యాకన్న పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి ఫూలే జయంతి

నర్సంపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సావిత్రిబాయి ఫూలే 194వ జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశాక, సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు పంజాల రమేశ్, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి మాట్లాడుతూ జ్యోతిరావు ఫూలే ద్వారా సావిత్రిబాయి ఫూలే చదువు నేర్చుకొని దళిత, బీసీ మహిళల కోసం 57 పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యాబుద్ధులు నేర్పించిన గొప్ప వ్యక్తి సావిత్రిబాయి ఫూలే అని కొనియాడారు. జనాభా నిష్పత్తి ప్రకారం స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కంబాల వెంకన్న, ఇల్లందుల సాంబయ్య, సందీప్, అరుణ. శ్రీలత, పద్మ, స్వప్న, కవిత తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ఐద్వా కార్యాలయంలో సావిత్రి బాయిఫూలే జయంతి వేడుకలను ఐద్వా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎండి.ఫరీదా, బిట్ల స్వప్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏఐఎఫ్‌డిడబ్ల్యూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వంగల రాగ సుధ ఆధ్వర్యంలో సావి త్రిబాయిఫూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

• నర్సంపేట టౌన్ (ఆంధ్రజ్యోతి) : పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో ప్రముఖ సామాజికవేత్త, స్త్రీ విద్యా ఆవశ్యకతపై ప్రజలను చైతన్యపరిచిన సావిత్రీబాయి ఫూలే జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని మహేశ్వరం గ్రామంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ మహ్మద్ ఇషాక్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణంలోని బాలుర హైస్కూల్‌లో ఎంఈవో కొర్ర సారయ్య ఆధ్వర్యంలో సావిత్రిబాయి ఫూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సోల్తి సారయ్య ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలో సావిత్రీబాయి ఫూలే జయంతి ఘనంగా నిర్వహించారు.

• ఖానాపురం (ఆంధ్రజ్యోతి) : సావిత్రిబాయి ఫూలే జయంతి వేడుకలను అశోక్‌నగర్ గిరిజన సైనిక పాఠశాల, ఖానాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో, మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఫూలే చిత్ర పటాలకు పూల మాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్ర మంలో ఎంఈవో శ్రీదేవి, ప్రిన్సిపాల్ సురేందర్, డైరెక్టర్ శ్రీనివాస్‌స్వామి పాల్గొన్నారు.



నర్సంపేట అంబేద్కర్ సెంటర్‌లో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న బీసీ సాధన సమితి నాయకులు

• చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో సావిత్రిబాయి ఫూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో మహిళ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళ ఉపాధ్యాయులు ఎల్.సునీత, కె.మాధవి, సీహెచ్.మాధవి, బి.రమాదేవిలను సన్మానించారు.

• నెక్కొండ (ఆంధ్రజ్యోతి) : అణగారిన వర్గాల కోసం మహిళ అక్షరాస్యతకై జీవన పర్యంతం పోరాడిన భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి ఫూలే ఆశయాలకోసం మహిళలు కృషి చేయాలని మండలంలోని అప్పల్‌రావుపేట హై స్కూల్ ఇంచార్జీ హెడ్మాస్టర్ బి . శ్రావన్‌కుమార్ కోరారు. పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులు గీత, భూలక్ష్మి, శోభారాణిలను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందించారు. నెక్కొండలోని అంబేద్కర్ భవనంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మాంకాల యాదగిరి ఆధ్వర్యంలో సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి పూల మాలలువేసి జయంతి వేడుకలను జరిపారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు ఈదునూరి యాకయ్య, చెన్నకేశవులు, ఎపీఎం శ్రీనివాస్, భారతి మహిళ మండలి అధ్యక్షురాలు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇల్లందలో ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులు ఆమె చిత్రపటానికి పూలమావేసి నివాళులర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా అధికారికంగా ప్రకటించడంతో హెచ్ఎం విజయ, ఉపాధ్యాయులను, అగన్‌వాడీ టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్థులు మోడెం కుమారస్వామి, కుమారస్వామి, ఎద్దు సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

• గీసుగొండ (ఆంధ్రజ్యోతి) : సావిత్రిబాయి ఫూలే జయంతి వేడుకలను పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంగదేవిపల్లి జడ్పీ పాఠశాలలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో 35 మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం రజాక్, జీసీడీవో ఫ్లోరెన్స్, ఏఎస్‌వో వేణుగోపాల్, పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్లా, జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

• సంగెం(ఆంధ్రజ్యోతి): దేశంలో తొలి మహిళ ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి ఫూలే సేవలు చిరస్థాయిగా నిలిచాయని జ్యోతిరావు ఫూలే సామాజిక సంఘ సంస్కర్త, మండల శాఖ కార్యదర్శి కోడూరి వెంకట్ చెప్పారు. మండలకేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి, ఆనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ బహుజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్, మండలశాఖ అధ్యక్షుడు అనిల్ యాదవ్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాజుగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన

గీసుగొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): 15వ డివిజన్ మొగిలిచర్ల శివారులో నిర్మించే 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఈ నెల 5న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్యశారద శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ రియాజుద్దీన్, విద్యుత్ అధికారులు ఉన్నారు. అంతకు ముందు గీసుగొండ జడ్పీ పాఠశాలలో ఈ నెల 8 నుంచి 11 వరకు జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల ఏర్పాట్లను పరిశీలించారు. క్రీడాకారులకు అన్ని సౌకర్యాలను కల్పించాలని నిర్వాహకులకు సూచించారు.

కోపాకుల చెరువు ఆయకట్టుకు నీరు విడుదల

చెన్నారావుపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కోపాకుల చెరువు కింద సాగు నీటిని శుక్రవారం రైతులు విడుదల చేశారు. అధికారులు తైబందీ విషయాన్ని పట్టించుకోకపోవటంతో ఎట్టకేలకు రైతులు కొందరు తైబందిని ఖరారు చేసుకొని సాగు నీటిని విడుదల చేశారు. చెరువులోని నీటి ద్వారా పుట్టల పంపు కింద 60 ఎకరాలను, పాకాల వాగుపై ఉన్న లిఫ్ట్‌తో మరో 60 ఎకరాలను సాగు చేయడం జరుగుతుందని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు బొంత సారయ్య, వీరమల్ల సుధర్శన్‌రెడ్డి, వెంకటనర్సు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం చేయాలి

దుగ్గొండి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతం చేయాలని ఎంపీడీవో అరుంధతి ఆదేశించారు. మండలంలోని తొగర్రాయి గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఎంపీడీవో పరిశీలన చేసి మాట్లాడుతూ- సర్వే పారదర్శకంగా ఉండాలని ఏలాంటి వివాదాలు రాకుండా సర్వే నిర్వహకులు వ్యవహరించాలన్నారు.

నేషనల్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మొండ్రాయి విద్యార్థి



ప్రణయ్‌వర్ధన్

సంగెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొండ్రాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి నేషనల్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. విజయ తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలకు చెందిన పి.ప్రణయ్‌వర్ధన్ నేషనల్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడని వివరించారు. ఆర్మూర్‌లో జరిగిన స్కూల్‌గేమ్స్‌లో ప్రతిభ కనబర్చడంతో ఔరంగబాద్‌లో ఈనెల 5నుంచి 9 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రణయ్‌వర్ధన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మనోహర్, ప్రభాకర్, హనుమంతరావు, ప్రభాకర్, ప్రకాష్, పాఠశాల పిడి ముఖర్జీలు పాల్గొన్నారు.

వేల్పుల చేరాలు యాదవ్ విగ్రహావిష్కరణ



చేరాలుయాదవ్ విగ్రహాన్ని అవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా

సంగెం, జనవరి 3 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని తిమ్మాపురంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అవార్డు గ్రహీత, శ్రీమల్లికార్జున గొర్రెకాపరుల సంఘం ఛైర్మన్ వేల్పుల చేరాలు యాదవ్ విగ్రహాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రె కాపరుల సంక్షేమం కోసం నిరంతరం కృషిచేసి నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అవార్డును అందుకుని పలువురికి ఆదర్శంగా నిలిచారని చెప్పారు. గ్రామస్థుల సహకారంతో చేరాలుయాదవ్ కుమారులు ఏర్పాటు చేసిన విగ్రహంను ప్రజలందరి సమక్షంలో అవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, సంగెం సొసైటీ ఛైర్మన్ వేల్పుల కుమారస్వామి యాదవ్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు పంపిణీ

గీసుగొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): గీసుగొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త దౌడు బాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయన కుటుంబానికి ప్రమాద బీమా కింద రూ. 2లక్షలను మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం అందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, పార్టీ మండల కార్యదర్శి చల్లా వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు పుండ్రు జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

గీసుగొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందనాయక్ తండాకు చెందిన భూక్యా బాలరాజ్, బాదావత్ విష్ణు ఇటీవల వేర్వేరు కారణాలతో మృతిచెందారు. వారి కుటుంబాలకు సామాజికవేత్త అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.10వేలు పంపించారు. ఈ నగదును స్థానిక నాయకులు అల్లం మర్రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్ శుక్రవారం బాధితులకు అందచేశారు. కార్యక్రమంలో నాయకులు మంద రమేష్, సుమన్, మాజీ సర్పంచ్‌లు అమ్మి, సరోజన పాల్గొన్నారు.

• వర్ధన్నపేట (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రానికి చెందిన కొండేటి సోమమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట పీఏసీఎస్ ఛైర్మన్ కౌడగాని రాజేష్‌ఖన్నా, సెక్రెటరి వెంకటయ్యలు శుక్రవారం సోమమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అంద జేశారు. వారి వెంట 10వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ తుమ్మల రవీందర్, కొత్తూరు కరుణాకర్, చిర్ర సామెల్, కొండేటి కుమారస్వామి, గాయల సుమన్ తదితరులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

పర్వతగిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాతండాకు చెందిన పాల్య రాజారాం, బానోత్ సాలిలు మృతిచెందగా వారి కుటుంబాలను కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా ఛైర్మన్ బొంపెల్లి దేవేందర్‌రావు శుక్రవారం పరామర్శించారు. వారి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు భూక్యా శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ బానోత్ హము, మాజీ వార్డు సభ్యుడు నరసింహ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్యా సోమ, భూక్యా పంతులు, లాలు, ఈర్య తదితరులు ఉన్నారు.

డీటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

నెక్కొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : డీటీఎఫ్ నెక్కొండ మండల అధ్యక్షుడిగా బీ.బాలాజీ, ప్రధానకార్యదర్శిగా డి.కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా పి.యాదగిరి, ఎ.రేణుక, కార్యదర్శులుగా జి.కిరణ్, జి.రజితాదేవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కౌన్సిల్ జాన్ తెలిపారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి



మృతురాలు దేవులమ్మ

రాయపర్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని జగ్గయ్య తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జగ్గయ్య తండాకు చెందిన భూక్యా దేవులమ్మ (60) ఇంట్లో జారిపడి తలకు తీవ్ర గాయం కావడంతో మృతి చెందింది. ఈ మేరకు ఇంకా ఏమైన కారణాలు ఉన్నాయా అంటూ పోలీసులు అనుమానాస్పద స్థితి కేసు నమోదు చేసినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రంగసముద్రం చెరువులో మొసలి కలకలం

నర్సంపేట టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గురిజాల గ్రామ శివారులోని రంగసముద్రం చెరువులో మొసలి కనిపించడంతో గ్రామంలో శుక్రవారం కలకలం రేకెత్తించింది. వివరాలిలా వున్నాయి. చేపలవేట కోసం వెళ్లిన మత్స్యకారులకు మొసలి కనిపించడంతో బెంబేలెత్తిపోయారు. దీంతో చెరువులోకి దిగడానికి మత్స్యకారులు జంకుతున్నారు.

ఎంసీపీఐ(యూ) సీనియర్ నాయకుడు కన్నుమూత



చిన్నఎల్లయ్య(ఫైల్)

దుగ్గొండి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మంపేటకు చెందిన ఎంసీపీఐ (యూ) సీనియర్ నాయకుడు ఎలకంటి చిన్నఎల్లయ్య(80) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఎంసీపీఐ(యూ) వ్యవస్థాకుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ అనుచరుడిగా ఉండి పేదల పక్షాన నిలిచి భూస్వామ్య, పెత్తందారులకు వ్యతిరేకంగా ఉద్యమించారు. భూపోరాటంలో ప్రధాన పాత్ర పోషించి, పలుసార్లు జైలు జీవితం గడిపారు. ఎల్లయ్య మృతితో ఎంసీపీఐ(యూ) పార్టీకి తీరని లోటని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి ఎండీ రాజాసాహెబ్, రాష్ట్ర నాయకుడు నాగెల్లి కొంరయ్య, మండల ప్రధాన కార్యదర్శి సింగతి మల్లికార్జున్‌లు పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి గాదెగొని రవి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, రాష్ట్ర నాయకుడు కుసుంబ బాబురావు నివాళులర్పించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



మృతురాలు సుగుణ

దుగ్గొండి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ మహిళా మృతి చెందిన సంఘటన మండలంలోని రెబల్లేలో శుక్రవారం సాయంత్రం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని రెబల్లే గ్రామానికి చెందిన గుగులోతు సుగుణ(50) మొక్కజొన్న పంటకు నీరు పెట్టడానికి వ్యవసాయ బావి దగ్గరకు పోయి పంపుసెట్టు ఆన్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యు దాఘాతంతో మృతి చెందింది. మృతి చెందిన సుగుణకు భర్త మూడేళ్ల కిందట చనిపోగా, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్టేషన్ చింతలపల్లిలో చోరీ

గీసుగొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్టేషన్ చింతలపల్లిలో ఓ ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. బంగారు, వెండి అభరణాలతో పాటు నగదును ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవ్వాజి హేమలత కుటుంబ సభ్యులు డిసెంబరు 30న తిరుపతికి వెళ్లారు. శుక్రవారం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో ఉన్న 4.8 తులాల బంగారం, 35 తులాల వెండి, రూ.30 వేల నగదు, ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఎత్తుకెళ్లారని, వాటి విలువ రూ.3,35,000 ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మహేందర్ కేసు దర్యాప్తుచేస్తున్నారు.

దాతల సాయంతో మధ్యాహ్న భోజనం

సంగెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికయ్యే ఖర్చును ఇచ్చేందుకు శుక్రవారం మండలంలోని కుంటపల్లికి చెందిన ఇందేరి శివారెడ్డి-రాణి దంపతులు ముందుకు వచ్చారు. శుక్రవారం కళాశాలలోని విద్యార్థులందరికీ భోజనాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కాక మధవరావు మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్నం పూట భోజనం అందించి విద్యార్థులకు భోజన వసతి కలిపించాలన్న లక్ష్యంతో దాతల సహకారం తీసుకుంటున్నట్లు చెప్పారు. మానవత్వంతో దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దాతను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆధ్యాపకులు విజయ నిర్మల, రాజ్‌కుమార్, బుచ్చిరెడ్డి, నాగరాజు, అనిల్‌కుమార్, పవన్‌కుమార్, యాకసాయిలు తదితరులు పాల్గొన్నారు.

కూతురి పెళ్లి సొత్తు బుగ్గి

• ఖాదర్‌పేటలో విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

• బంగారం, వెండితో పాటు నగదు కాలిందని బాధితుడి ఆవేదన



ఇంట్లో కాలిపోయిన వస్తువులను చూపుతున్న బాధితుడు

చెన్నారావుపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కూతురి పెండ్లికోసం నర్సంపేట బ్యాంకులో తీసుకువచ్చిన రూ.4లక్షల 47వేల నగదు, ఇంట్లో ఉన్న 4 తులాల బంగారం, 20 తులాల వెండి.. మంటల్లో కాలిపోయాయి. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండంలోని ఖాదర్‌పేట గ్రామంలో విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైంది. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. దీంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు. బాధితుడి కథనం ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన గుంటి రవి-లక్ష్మి దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. రోజువారి లాగానే శక్రవారం ఇంటికి తాళంపెట్టి కుటుంబ సభ్యులు అందరూ వ్యవసాయ బావుల వద్దకు వెళ్లారు. గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ సమస్యతో ఉదయం 11గంటల సమయంలో ఇంట్లో విద్యుత్ తీగలకు మంటలు చెలరేగాయి. మంటలు వ్యాపించి బట్టలు, వస్తువులు, బియ్యం బస్తా,ఇంట్లో సామగ్రి మంటల్లో కాలిపోయాయి. అంతేకాకుండా తన కూతురు ప్రసన్న పెండ్లికోసం నర్సంపేటబ్యాంకులో తీసుకువచ్చిన రూ.4లక్షల 47వేల నగదు, ఇంట్లో ఉన్న 4 తులాల బంగారం, 20 తులాల వెండి మంటల్లో కాలిపోయాయి. చుట్టు పక్కల వారు గమనించి రవికి సమాచారం అందించారు. వెంటనే ఇంటికి చేరుకొని గ్రామస్థుల సాయంతో మంటలను ఆర్పివేశారు. కాగా, కూలీ పనులు, వ్యవసాయం చేసుకుంటూ జీవనం చేసుకొనే కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే గ్రామంలో ఈ ప్రమాదం చోటు చేసకుందని గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నెక్కొండ విద్యావనరుల కార్యాలయంలో పీఆర్టీయూ టీఎస్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో రత్నమాల

నెక్కొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచుటకు ఉత్తమ ఫలితాలను సాధించుటకు ఉపాధ్యాయులు కృషిచేయాలని మండల విద్యాశాఖాధికారి వి.రత్నమాల కోరారు. పీఆర్టీయూటీఎస్ క్యాలెండర్‌ను శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పించడమే కాకుండా ఉచితంగా అల్పాహారం, మధ్యాహ్నభోజనం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయుటీఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు మాలోతు ప్రతాప్‌సింగ్, కర్ర యాకుబ్‌రెడ్డి, నెక్కొండ, చంద్రుగొండ హైస్కూల్ హెడ్మాస్టర్‌లు రంగారావు, రవికుమార్, పీఆర్టీయూటీఎస్ నాయకులు రవీంద్రనాథ్, శ్రీధర్‌రెడ్డి, సుకన్య తదితరులు పాల్గొన్నారు. అలాగే టీఎస్‌యుటీఎఫ్ క్యాలెండర్, డైరీలను శుక్రవారం ఎంఈవో రత్నమాల అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా పాక శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రఘురామయ్య, ప్రధాన కార్యదర్శి రమేశ్, ఐలయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు .

• పర్వతగిరి (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో పలు ఉపాధ్యాయ, ఉద్యోగవర్గాలు శుక్రవారం క్యాలెండర్‌లను ఆవిష్కరిం చాయి. డీటీఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈవో గాయపు లింగారెడ్డి డైరీ, క్యాలెండ ర్‌లను ఆవిష్కరించారు. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు వరంగంటి సంపత్ ఆవిష్కరించారు. అన్నారం షరీఫ్ గ్రామంలోని దర్గా ఆవరణలో ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వంగ రాంబాబుగౌడ్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్ అవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో పాక రమేష్‌బాబు, వెంకటరమణారెడ్డి, మహంకాళి రామస్వామి, గొడుగు భిక్షపతి, వినయ్, రమేష్, అఖిల్, అశ్విని, రాజబాబు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

• ఖానాపురం (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో టీఎస్‌యూటీఎఫ్, పీఆర్టీయూల ఆధ్వర్యంలో ఆయా సంఘాల క్యాలెండర్లను వేరువేరుగా ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు వేములపల్లి రాంమోహన్‌రావు, పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు భాస్కర్, ఎంఈవో శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• నర్సంపేట టౌన్ (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ మోడల్ పాఠశాలలో పీఆర్‌టీయూ టీఎస్ నర్సంపేట మండల శాఖ ఆధ్వర్యంలో 2025 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు కోడం సాంబయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ టీఎస్ నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం నందగోపాల్, ఉపాధ్యాయులు సదాశివుడు తదితరులు పాల్గొన్నారు.

• దుగ్గొండి (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను సంఘం మండల అధ్యక్షుడు నాంపెల్లి రాజయ్య, ప్రధాన కార్యదర్శి మేముల మహేశ్‌లు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు డైరీ దిక్సూచిగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రామస్వామి, రఘునాధం, మేక రాజు, నిజామోద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

• అధికారుల నిర్లక్ష్యం వల్లే ఉద్యోగం కోల్పోతున్నా..

• డీఎస్సీ-2024 స్పెషల్ ఎడ్యుకేషన్ ర్యాంకర్ మహేందర్



మాట్లాడుతున్న మహేందర్

ఖానాపురం, జనవరి 3 (ఆంధ్ర జ్యోతి) : అధికారుల నిర్లక్ష్యం, తప్పిదాల వల్లే ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం కోల్పో వలసి వస్తోందని డీఎస్సీ-2024లో స్పెషల్ ఎడ్యుకేషన్ సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) విభాగంలో జిల్లా 10వ ర్యాంకు సాధించిన పాలకుర్తి మహేందర్ శుక్రవారం తన ఆవేదనను వెలిబుచ్చారు. మండల కేంద్రానికి చెందిన మహేందర్ డీఎస్సీ 2024 స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌జీటీ విభాగంలో 10వ ర్యాంకు సాధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయినప్పటికీ నేటి వరకు తనకు నియామక ఉత్తర్వులు ఇవ్వకపోవడంపై అధికారులు అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయంపై డీఈవో, కలెక్టర్‌కు వినితి పత్రం అందజేసినప్పటికీ ఫలితం లేదన్నారు. 2024 నవంబర్ 2న జరిగిన కౌన్సెలింగ్ కమ్ పోస్టింగ్‌లో 1:1 లిస్ట్‌లో తన పేరు లేకుండా చేయడంతో తీవ్ర అన్యాయానికి గురయ్యానని ఆవేదన వ్యక్తం చేశాడు. అప్పుడే తనకు జరిగిన అన్యాయంపై అధికారులను సంప్రదించగా నిర్లక్ష్యంగా టెక్నికల్ తప్పిదాలు జరిగాయని సంబంధిత అధికారులు తెలిపినట్లు మహేందర్ వివరించారు. ఇప్పటికీ రెండు నెలలు గడుస్తున్నా ఎటువంటి నియామక ఉత్తర్వులు అందించలేదని, ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని శుక్రవారం మండల కేంద్రంలోని తన ఇంటి వద్ద భార్య, పిల్లలతో కలిసి ఆవేదన వ్యక్తం చేశాడు.



ఖోఖో కోచింగ్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న డీఈవో జ్ఞానేశ్వర్

ఖో ఖో కోచింగ్ క్యాంప్ ప్రారంభం

గీసుగొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): గీసుగొండ జడ్పీ పాఠశాలలో ఈ నెల 8నుంచి 11వరకు జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఖోఖో జట్టు కోచింగ్ క్యాంప్‌ను డీఈవో జ్ఞానేశ్వర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పట్టాభి, వీరగోని రాజ్‌కుమార్, ఖోఖో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట శ్యాంప్రసాద్, కోచ్ రాజారపు రమేష్, ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కైలాస్‌యాదవ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో డీఈవో తనిఖీలు

గీసుగొండ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను డీఈవో జ్ఞానేశ్వర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల కువెళ్లి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను సిద్ధంచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని కాంట్రాక్టు ఏజెన్సీలకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో సాంబయ్య, హెచ్ఎం పట్టాభి పాల్గొన్నారు.